విశాఖపట్టణం
శనివారం 20 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:148 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# విశాల్ గున్నీ సస్పెన్షన్ పొడిగింపు

### విచారణ పూర్తయ్యే వరకు అమల్లో

### సీఎస్ సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ




(అమరావతి - జయజయహే)

ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వివాదాస్పద కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని సస్పెన్షన్‌ను మరోసారి పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీ.సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ..మిగతా 2లో



# తెలంగాణలో జేఎస్పీ ఆఫీస్

### పార్టీ జెండాను ఆవిష్కరించిన అధినేత పవన్

### గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం

### పొలిటికల్ రోడ్ మ్యాప్‌పై కసరత్తు

(హైదరాబాద్ - జయజయహే)

శాసనసభ ఎన్నికలలో ఘనవిజయం సాధించి, కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. ఇప్పుడు పొరుగు రాష్ట్రమైన తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని మణికొండ (మల్కం చెరువు సమీపంలో) నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు ..మిగతా 2లో

# ఏపీలో 137 శాతం రుణాలు


### లోన్స్ జారీలో దక్షిణాదిలో టాప్ ఏపీనే

### రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ వెల్లడి

### ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించాలి

### సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం





(అమరావతి - జయజయహే)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. సచివాలయంలోని 5వ బ్లాక్‌లో శుక్రవారం మధ్యాహ్నం 235వ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో 2026-27 వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో సీఎం చంద్రబాబు చర్చించారు. వ్యవసాయ రంగం, ఎంఎస్ఎంఈలు, స్వయం సహాయ సంఘాలు, కౌలు రైతులకు అందించిన రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.3,86,249కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బ్యాంకర్లు వివరించారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1,17,357కోట్లు, ప్రాధాన్య రంగానికి రూ.5,19,693కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రుణాల పంపిణీ 137 శాతం మేర ఉన్నట్లు సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకర్లకు ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. మరోవైపు రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించేలా సహకారం అందించాలని కోరారు. కాగా, ఎస్ఎల్‌బీసీ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఆశిష్ పాండే, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ డైరెక్టర్ నీలమ్ అగర్వాల్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్, నాబార్డ్ జీఎం కేవీఎస్ ప్రసాద్, తదితరులు హాజరయ్యారు.

# కొడాలి నానికి ఉచ్చు

### క్రిమినల్ ప్రాసిక్యూషన్ కు ప్రభుత్వ అనుమతి

### అప్పటి ఎస్ఈసీ నిమ్మగడ్డపై వివాదాస్పద వ్యాఖ్యలే కారణం

### ఇప్పుడు విచారణ వేగవంతం చేసిన ప్రభుత్వం

(అమరావతి - జయజయహే)

రాజకీయాల్లో అత్యంత వివాదాస్పద , దూకుడు గల నాయకుడిగా పేరొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని పై చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలపై, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారిపై ఆయన చేసిన వ్యాఖ్యలు, చర్యలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ క్రమంలోనే కొడాలి నానిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు ఏపీ హోంశాఖ అధికారికంగా అనుమతి ఇవ్వడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, లోకేష్‌లతో పాటు అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ వంటి రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిపై కొడాలి నాని తీవ్రస్థాయిలో బూతులు, అనుచిత వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా, ..మిగతా 2లో





# నేడే అన్నదాత సుఖీభవ

### పల్నాడు జిల్లా లింగంగుంట్లలో శ్రీకారం

ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం కింద 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత ఆర్థిక సాయాన్ని శనివారం విడుదల చేయనుంది. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చే లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ..మిగతా 2లో



# యోగాంధ్ర సంబరం నేడు

### ఉండవల్లి గుహల వద్ద యోగా డే

### హాజరుకానున్న రామ్ దేవ్ బాబా, చంద్రబాబు

(అమరావతి - జయజయహే)

యోగాను కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా జీవన విధానంగా మార్చాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈసారి యోగాంధ్ర కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా యోగా గురువు బాబా రాందేవ్ రానున్నారు. శుక్రవారం ..మిగతా 2లో

# గాదె సాయికృష్ణది ప్రభుత్వ హత్యే

### రెడ్ బుక్ రాజ్యాంగం కారణంగానే దారుణాలు

### నిందితులుగా సీఎం, మంత్రి లోకేష్, హోంమంత్రిలను చేర్చాలి

### మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్

2


# పెద్దల సభలో పట్టు

## బలాన్ని పెంచుకున్న ఎన్డీఏ

### 152 స్థానాలకు చేరిన బలగం

### మూడింట రెండొంతుల మెజార్టీకి 11 సీట్లే దూరం

### రాజ్యాంగ సవరణలకు కీలక ఆమోదం సులభతరం



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)


కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఇప్పుడు రాజ్యసభలోనూ తన బలాన్ని మరింత పెంచుకుంటున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏకు అనుకూలంగా రావడంతో, ఆ కూటమి సంఖ్యాబలం గణనీయంగా పెరిగింది. దీంతో భవిష్యత్తులో కీలక బిల్లులను ఆమోదించుకునే దిశగా బీజేపీ మరింత బలపడుతున్నట్లు కనిపిస్తోంది. జూన్ 18 వరకు దేశంలోని 10 రాష్ట్రాల్లో 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఎక్కువ స్థానాలు ఎన్డీఏ ఖాతాలోకి వెళ్లాయి. తొలుత ఏకగ్రీవంగా ఎన్నికైన 24 మంది సభ్యుల్లో 19 మంది ఎన్డీఏ కూటమికి చెందినవారు కాగా, జార్ఖండ్‌లో జరిగిన ఎన్నికలో పరిమల్ నత్వానీ విజయం సాధించడంతో ఆ సంఖ్య 20కి చేరింది. ప్రస్తుతం రాజ్యసభలో ..మిగతా 2లో

# అల్లు అర్జున్‌కు సమన్లు

### వ్యక్తిగతంగా సోమవారం హాజరుకావాలని ఆదేశం

### సంధ్య థియోటర్ తొక్కిసలాట కేసు

(హైదరాబాద్ - జయజయహే)



హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన విషాద తొక్కిసలాట కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ స్టార్ హీరో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు హైదరాబాద్ నాంపల్లి కోర్టు వ్యక్తిగత సమన్లు జారీ చేసింది. వచ్చే సోమవారం ఆయన కచ్చితంగా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసును నాంపల్లి హై కోర్టు తీవ్రంగా పరిగణించింది. అందుకే అల్లు అర్జున్‌తో పాటు ఈ కేసులో ఉన్న మొత్తం 19 మంది ..మిగతా 2లో

# గాదె సాయికృష్ణది ప్రభుత్వ హత్యే



## రెడ్ బుక్ రాజ్యాంగం కారణంగానే దారుణాలు

## నిందితులుగా సీఎం, మంత్రి లోకేష్, హోంమంత్రిలను చేర్చాలి

## మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్

**విశాఖపట్నం, జూన్ 19, జయ జయహే :**

కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్ డెత్‌కి గురైన కాపు యువకుడు గాదె సాయికృష్ణది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు కోసం పోలీసులను విచ్చలవిడిగా వాడుకుంటున్న కారణంగానే ఈ దారుణాలు జరుగుతున్నాయని పశ్చిమ గోదావరి జిల్లా వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ధ్వజమెత్తారు. విశాఖలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిటీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, హోంమంత్రి అనితలను కూడా నిందితులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. సీఐ నాగరాజుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారంటే సాయికృష్ణ బతికే లేడని, చంపేసినట్టు ప్రభుత్వం ఒప్పుకున్నట్టేనని, సీఐని బలిచేసి మిగతా పోలీసు ఉన్నతాధికారులను తప్పించే కుట్ర జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. కేసును నీరుగార్చి తప్పించుకునే కుట్రలో భాగంగానే ఐజీ స్థాయి అధికారులపై విచారణకు ఎస్పీని నియమించారని వివరించారు. ఆ తల్లికి న్యాయం జరగాలన్నా, ఈ దారుణంతో సంబంధం ఉన్న వారందరికీ శిక్ష పడాలన్నా సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఏ తప్పూ చేయనట్టయితే కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీ టీవీ ఫుటేజ్‌లన్నీ విడుదల చేయాలని గుడివాడ అమర్నాథ్ డిమండ్ చేశారు.

### ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే... !

కూటమి పాలన ఇలాగే కొనసాగితే రాష్ట్ర భవిష్యత్ తరాల పరిస్థితి ఏమైపోతుందోనన్న ఆవేదన కలుగుతోంది. గాదె సాయికృష్ణ అనే 23 ఏళ్ల యువకుడిని కృష్ణలంక పోలీసులు లాకప్‌లోనే అతి దారుణంగా హింసించి చంపేసిన దారుణం చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తోంది. తన కొడుకుని చూపించమని పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతూ నెలరోజుల పాటు ఆ తల్లి పడిన కష్టం, ఇప్పుడు కొడుకు బతికి లేడని, ఆఖరి చూపు కూడా దక్కలేదని తెలిసి కన్నీరు మున్నీరవుతున్న తీరు చూస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోతోంది. చివరికి న్యాయస్థానాన్ని ఆశ్రయించి హెబియస్ కార్పస్ పిటిషన్ వేస్తే తప్ప కొడుకు లేడన్న విషయమైనా ఇతర మార్గాల్లో వెలుగులోకి వచ్చింది. సీఐ నాగరాజుపై హత్యాయత్నం సెక్షన్ కింద పెట్టిన కేసుతో లాకప్‌లోనే చంపేశారని పోలీసులు, ప్రభుత్వం అంగీకరించినట్టయింది. లాకప్ లో హింసించి చంపడమే కాకుండా ఆఖరుకి బూడిద కూడా లేకుండా చేసిన దుర్మార్గం దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరిగి ఉండదు. ఇటువంటి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న చంద్రబాబు సిగ్గుపడాలి. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయి. గాదె సాయికృష్ణ ఘటనతో రెడ్‌బుక్ అరాచకాలు పరాకాష్టకు చేరినట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో జంగిల్ రాజ్ పాలన సాగుతోంది.

### కూటమి ప్రభుత్వం వచ్చాక 790 హత్యలు

రాష్ట్రంలో పోలీసులు 70 వేల సీసీ కెమెరాలు అమర్చారని గొప్పగా చెబుతున్న హోంమంత్రి అనిత, ఇప్పుడు కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో సాయికృష్ణని ఎలా విచారించారో ఆ ఫీడ్ మొత్తం కోర్టు ముందుంచాలి. వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక 790 హత్యలు జరిగితే అందులో రాజకీయ కక్షలతో 30 మందిని పొట్టనబెట్టుకున్నారు. వందల మంది మహిళలు, చిన్నారులపై అత్యాచారం చేశారు. చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమై 20 రోజులవుతున్నా ఇంతవరకు పోలీసులు ఆచూకీ కనిపెట్టలేకపోయారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముచ్చుమర్రిలో అదృశ్యమైన బాలిక మృతదేహం ఇంతవరకు పోలీసులు వెతికి పట్టుకురాలేకపోయారు. ఈ సమావేశం లో మాజీ శాసన సభ్యులు చింతలపూడి వెంకటరామయ్య , జిల్లా పార్టీ పర్యవేక్షులు రవి రెడ్డి , రాష్ట్ర పార్టీ కార్యదర్శి గండి రవి తదితరాలు పాల్గొన్నారు



# కొడాలి నానికి ఉచ్చు

**మొదటి పేజీ తరువాయి...**

ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను ఉద్దేశించి వ్యక్తిగత దూషణలు చేయడం, ఎన్నికల వ్యవస్థను కించపరిచేలా మాట్లాడటంపై అప్పట్లోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రభుత్వ ఉద్యోగులను, రాజ్యాంగ సంస్థల అధిపతులను విధులకు ఆటంకం కలిగించేలా బెదిరించడం, సమాజంలో అశాంతి రేకెత్తించేలా వ్యాఖ్యలు చేయడం వంటి ఐపీసీ సెక్షన్ల కింద నమోదైన పాత కేసుల ఆధారంగానే ఇప్పుడు విచారణను వేగవంతం చేస్తూ హోంశాఖ ఈ ప్రాసిక్యూషన్ ఆర్డర్స్ జారీ చేసింది. సాధారణంగా ప్రజాప్రతినిధులు లేదా మాజీ మంత్రులపై ఉన్న క్రిమినల్ కేసులలో కోర్టులు విచారణ జరపాలన్నా, లేదా పోలీసులు తదుపరి కఠిన చర్యలు తీసుకోవాలన్నా హోంశాఖ నుంచి అధికారిక అనుమతి తప్పనిసరి. హోంశాఖ అనుమతి ఇవ్వడంతో ఇప్పుడు కొడాలి నానిపై ఉన్న కేసులలో పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయడానికి, అలాగే అవసరమైతే ఆయన్ను కస్టడీలోకి తీసుకుని విచారించడానికి చట్టపరమైన మార్గం సుగమమైంది. దీంతో కొడాలి నానికి న్యాయపరమైన ఇబ్బందులు తీవ్రం కానున్నాయి. కొడాలి నాని కేవలం ఒక మాజీ మంత్రి మాత్రమే కాదు.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తెలుగుదేశం పార్టీని, చంద్రబాబు కుటుంబాన్ని వ్యక్తిగతంగా అత్యంత దారుణంగా టార్గెట్ చేసిన ప్రధాన నాయకుడు. గుడివాడ వేదికగా చంద్రబాబుపై ఆయన చేసిన సవాళ్లు, వాడిన భాష టీడీపీ కేడర్‌లో తీవ్రమైన కసిని పెంచాయి. 2024 ఎన్నికల్లో కొడాలి నాని ఓడిపోయిన నాటి నుండి, ఆయన చేసిన వ్యాఖ్యలకు చట్టపరంగా బుద్ధి చెప్పాలని టీడీపీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పుడు హోంశాఖ ఈ నిర్ణయం తీసుకోవడం ద్వారా.. తప్పు చేస్తే, రాజ్యాంగ వ్యవస్థలను దూషిస్తే ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందే అనే బలమైన సందేశాన్ని కూటమి ప్రభుత్వం ప్రజల్లోకి పంపింది. ఈ ప్రాసిక్యూషన్ పరిణామంతో గుడివాడ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒకప్పుడు గుడివాడను తన అడ్డాగా మార్చుకున్న కొడాలి నాని, ఇప్పుడు కేసుల భయంతో డిఫెన్స్‌లో పడిపోయారు. స్థానిక టీడీపీ నాయకత్వం ఈ పరిణామాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటూ, కొడాలి నాని హయాంలో జరిగిన అక్రమాలను కూడా తవ్వి తీసే పనిలో పడింది. అటు వైసీపీ మాత్రం దీనిని రాజకీయ కక్షసాధింపు గా అభివర్ణిస్తూ, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ.. నిమ్మగడ్డ రమేష్ కుమార్ వంటి వ్యవస్థల అధిపతులపై నాని వాడిన భాషను కోర్టుల్లో సమర్థించుకోవడం ఆ పార్టీకి అంత సులువు కాదనేది స్పష్టమవుతోంది. రాజకీయాల్లో నోటి దూకుడు, అధికార బలం ఎల్లకాలం కాపాడలేవని చెప్పడానికి కొడాలి నాని ప్రస్తుత పరిస్థితి ఒక ఉదాహరణ. ఏపీ హోంశాఖ ఇచ్చిన ఈ ప్రాసిక్యూషన్ అనుమతితో నాని చుట్టూ లీగల్ ఉచ్చు గట్టిగా బిగిసింది. రాబోయే రోజుల్లో కోర్టు విచారణలు ఎదుర్కొంటూ తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడం కొడాలి నానికి ఒక పెద్ద పరీక్ష కానుంది.

# విశాల్ గున్నీ సస్పెన్షన్ పొడిగింపు

**మొదటి పేజీ తరువాయి...**

విశాల్ గున్ని సస్పెన్షన్‌ను 2026 సెప్టెంబర్ 4 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసు విచారణ పూర్తయ్యే వరకు లేదా సెప్టెంబర్ 4వ తేదీ వరకు (ఏది ముందైతే అది) ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్: 469/2024 కేసులో విశాల్ గున్నిపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. విశాల్ గున్ని సస్పెన్షన్ కాలపరిమితిపై నిర్ణయం తీసుకునేందుకు 2026 జూన్ 12న ఉన్నత స్థాయి రివ్యూ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో కమిటీ పలు కీలక అంశాలను ప్రస్తావిస్తూ సస్పెన్షన్‌ను పొడిగించాలని సిఫార్సు చేసింది. విశాల్ గున్ని ప్రస్తుతం ఉన్నత పోలీస్ హోదాలో ఉన్నందున, ఒకవేళ ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేస్తే కేసులోని సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని కమిటీ అభిప్రాయపడింది. ఆయన విధుల్లోకి వస్తే ప్రస్తుతం జరుగుతున్న క్రిమినల్ కేసు విచారణ సజావుగా సాగకపోవచ్చని, విచారణపై ప్రభావం చూపే అవకాశం ఉందని కమిటీ వ్యాఖ్యానించింది. కమిటీ ఇచ్చిన నివేదిక, ఆల్ ఇండియా సర్వీసెస్ (డిసిప్లిన్ అండ్ అప్పీల్) రూల్స్-1969 నిబంధనలను పరిశీలించిన ప్రభుత్వం, సస్పెన్షన్ కొనసాగింపునకు ఆమోదం ముద్ర వేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని వివాదాస్పద పరిణామాలు, ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసు వంటి వ్యవహారాల్లో ఐపీఎస్ అధికారుల పాత్రపై తీవ్ర విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచారణను వేగవంతం చేస్తూ, తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే విచారణ ఎదుర్కొంటున్న విశాల్ గున్నిపై సస్పెన్షన్ వేటు వేయగా, ఇప్పుడు దానిని మరికొంత కాలం పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

# పెద్దల సభలో పట్టు

**మొదటి పేజీ తరువాయి...**

ఎన్డీఏ కూటమి మొత్తం బలం 152 స్థానాలకు చేరినట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా రాజ్యాంగ సవరణలకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీకి ఎన్డీఏ కేవలం 11 సీట్ల దూరంలో ఉండటం విశేషం. దీంతో భవిష్యత్తులో రాజ్యాంగ సవరణలకు సంబంధించిన కీలక బిల్లులను సులభంగా ఆమోదించే అవకాశం ఏర్పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు కూడా ఎన్డీఏకు కలిసి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేయడంతో ఆ స్థానాలపై చర్చ మొదలైంది. భవిష్యత్తులో మరికొంతమంది ఎంపీలు కూడా పార్టీని వీడే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. అలాంటి పరిస్థితి ఏర్పడితే, ఆ ఖాళీ స్థానాలను బీజేపీ దక్కించుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో బిజూ జనతా దళ్ (బీజేడీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) వంటి పార్టీలు అధికారికంగా ఏ కూటమిలోనూ లేకపోయినా, పలు కీలక సందర్భాల్లో ఎన్డీఏకు మద్దతు ఇస్తూ వచ్చాయి. బీజేడీకి ఐదుగురు, వైఎస్సార్‌సీపీకి ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఉండటం కూడా ఎన్డీఏకు అదనపు బలంగా మారే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష భారత కూటమి బలం తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి మిత్రపక్షాలు దూరం కావడంతో ఆ కూటమి సంఖ్య 64 మంది సభ్యుల వద్దే నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ఎన్డీఏ ఆధిపత్యం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాలు దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.



# తెలంగాణలో జేఎస్పీ ఆఫీస్

**మొదటి పేజీ తరువాయి...**

పవన్ కల్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణ వ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఓ సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది. ఇటీవలి కాలంలో పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఓ బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# నేడే అన్నదాత సుఖీభవ

**మొదటి పేజీ తరువాయి...**

లబ్ధి పొందనున్నారు.పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిధులను విడుదల చేయనున్నారు. ఈ విడతలో మొత్తం 46,85,838 రైతు కుటుంబాల ఖాతాల్లో రూ.3,125.47 కోట్లు జమ కానున్నాయి. ఇందులో 45,69,817 మంది భూ యజమాని రైతులు, 1,16,021 మంది అటవీ హక్కుల చట్టం కింద సాగు చేస్తున్న =శీఖీ= రైతు కుటుంబాలు ఉన్నాయి. ఈ నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.782.55 కోట్లుగా ఉంది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలవుతున్న ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి మొత్తం రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.6 వేలు అందిస్తోంది. మూడు విడతల్లో ఈ సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తుండగా, 2026-27 సంవత్సరానికి సంబంధించిన తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు కలిపి ఒక్కో రైతు ఖాతాలో రూ.7 వేలు జమ చేయనుంది. గత ఏడాది ఈ పథకం కింద మొత్తం రూ.8,985.41 కోట్లు రైతులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఇక సీఎం చంద్రబాబు శనివారం లింగంగుంట్ల గ్రామంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సౌకర్యాలను పరిశీలించడంతో పాటు రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమై, ప్రజావేదిక సభలో ప్రసంగించనున్నారు. అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.



# యోగాంధ్ర సంబరం నేడు

**మొదటి పేజీ తరువాయి...**

విజయవాడ చేరుకోనున్న ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమై యోగా ప్రచారం, ప్రజారోగ్య కార్యక్రమాలపై చర్చించనున్నారు. అనంమంతెన ఆశ్రమంలో బస చేయనున్నారు. ఈ నెల 20న ఉండవల్లి గుహల వద్ద నిర్వహించే ప్రత్యేక యోగా కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, బాబా రాందేవ్ కలిసి పాల్గొననున్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఉండవల్లి గుహల వేదికగా యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. కార్యక్రమం అనంతరం సీఎం చిలకలూరిపేట పర్యటనకు వెళ్లనున్నారు. 21వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి యోగా వేడుకలు జరగనున్నాయి. ఐదు వేల నుంచి ఆరు వేల మంది ఒకేసారి యోగా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షం కారణంగా ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయంగా అంబేద్కర్ కళావేదికలో కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 33 వేల కేంద్రాల్లో యోగా డే నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 2 లక్షల 60 వేల మందికి పైగా యోగా ట్రైనర్లను సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. యోగా డేలో పాల్గొనేందుకు కోటికి పైగా మంది నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా యోగా పట్ల ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా చేపట్టారు. సంజీవని కార్యక్రమంతో యోగాను అనుసంధానం చేసి ప్రజారోగ్యానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక థెరప్యూటిక్ యోగా కార్యక్రమాలు రూపొందించాలని ఆదేశించారు. యోగాను ఏడాది పొడవునా కొనసాగించేలా "ఇంటింటికీ యోగా" పేరుతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. యోగా మాస్టర్ ట్రైనర్లకు వచ్చే ఏడాది ప్రత్యేక పురస్కారాలు అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

# అల్లు అర్జున్‌కు సమన్లు

**మొదటి పేజీ తరువాయి...**

నిందితులకు సమన్లు పంపింది. ఈ కేసులో దాఖలైన చార్జ్‌షీట్‌లో పోలీసులు అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా (ఏ11) పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది. 'పుష్ప 2: ది రూల్' సినిమా విడుదలను పురస్కరించుకుని 2024 డిసెంబర్ 4న హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ లో ప్రీమియర్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా తన అభిమానులను అలరించేందుకు హీరో అల్లు అర్జున్ స్వయంగా థియేటర్ వద్దకు వచ్చారు. అయితే, ముందస్తు అనుమతులు లేకుండా, సరైన ప్లాన్ లేకుండా అల్లు అర్జున్ ర్యాలీలా రావడంతో అక్కడ ఒక్కసారిగా అరాచక వాతావరణం నెలకొంది. ఐకాన్ స్టార్‌ను చూసేందుకు వేలాది మంది అభిమానులు ఒకేసారి ఎగబడటంతో తీవ్రమైన తొక్కిసలాట జరిగింది. ఈ దురదృష్టకర తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ ఊపిరాడక ప్రాణాలు కోల్పోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి చాలా నెలల పాటు ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడాడు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు విచారణ జరిపారు. ఈ ఈవెంట్‌లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించలేదని, క్రౌడ్ మేనేజ్‌మెంట్ పూర్తిగా విఫలమైందని తేల్చారు. థియేటర్ యాజమాన్యం, ఈవెంట్ నిర్వాహకులతో పాటు నిబంధనలు ఉల్లంఘించి అక్కడికి వచ్చినందుకు అల్లు అర్జున్, ఆయన వ్యక్తిగత సిబ్బందిపై కూడా పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మరోవైపు బాధితురాలి కుటుంబానికి అల్లు అర్జున్ కుటుంబం అండగా నిలుస్తోంది. మొత్తం 23 మందిని ఈ కేసులో నిందితులుగా చేర్చగా, ప్రస్తుత విచారణల అనంతరం నాంపల్లి కోర్టు అల్లు అర్జున్ (ఏ11) సహా 19 మందికి తాజాగా సమన్లు జారీ చేయడం టాలీవుడ్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. చట్టప్రకారం సోమవారం అల్లు అర్జున్ న్యాయమూర్తి ముందు హాజరై తన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇదే కేసులో అల్లు అర్జున్ ను గతంలో పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. నాంపల్లి కోర్టు అతనికి 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో అల్లు అర్జున్ ను జైలుకు తరలించారు. అయితే హై కోర్టు నుంచి బెయిల్ తెచ్చుకోవడంతో అల్లు అర్జున్ ఒక రాత్రి జైల్లో ఉన్న తర్వాత బయటకు వచ్చాడు.

# ప్లానింగ్ అదిరింది...కమిషనర్ సార్...!

### 53 గజాల ప్లానుతో 350 గజాల నిర్మాణమా...?

### ఎందుకీ జీవీఎంసీ అధికారుల మౌనం...!

### సర్వే నంబర్ 176, 177లో ఏం జరుగుతోంది..?

**విశాఖపట్నం, జూన్ 19, జయ జయహే :**

విశాఖ నగరాభివృద్ధి, భవన నిర్మాణ నియంత్రణ, అక్రమ నిర్మాణాల నివారణ కోసం ఏర్పాటైన గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) టౌన్ ప్లానింగ్ విభాగం మరోసారి ప్రజల ప్రశ్నలకు కేంద్రబిందువుగా మారింది. సింహాచలం పరిధిలోని సర్వే నెంబర్లు 176 మరియు 177లో జరుగుతున్న అక్రమ నిర్మాణ వ్యవహారం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. విశాఖ నగరంలో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని తరచూ ప్రకటించే జీవీఎంసీ కమిషనర్ 98వ వార్డు సింహాచలం ప్రాంతంలోనీ ప్రియా గార్డెన్స్ లో సర్వేనెంబర్ 176, 177 లో జరుగుతున్న వివాదాస్పద అక్రమ నిర్మాణాన్ని మాత్రం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ చూడలేకపోయిందా...లేక చూడనట్టుగా వ్యవహరించిందా... అనే ప్రశ్నలు స్థానికుల్లో మెదులుతున్నాయి. సర్వే నెంబర్లు 176, 177 బౌండరీ పరిధిలో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణం చుట్టూ ఎన్నో సందేహాలు, అనుమానాలు, అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీపే నెంబర్ 1086/ 0520/ బీ/ఎంఏడీడబ్ల్యు/పీజీఈ/2026 జీవీఎంసీలో నమోదయిన 53 గజాలకు ప్లాను అనుమతులు, నిర్మాణ విస్తీర్ణం మధ్య ఉన్న వ్యత్యాసాలపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఈ నిర్మాణ స్థలాన్ని సింహాచలం దేవస్థానం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధులత ఆదేశాలతో దేవస్థానం సర్వేయర్ బృందం, ఇరిగేషన్ ఇంజనీర్లు వేర్వేరుగా సర్వే చేశారు. అయితే జీవీఎంసీ టౌన్ప్లానింగ్ అధికారులు మాత్రం ఆ జోలికి వెళ్లకపోవడం వెనుక మతలబు ఏంటో ఆ శాఖ ఉన్నతాధికారులకే ఎరుక.

**53 గజాల డాక్యుమెంటతో.. 350 గజాల నిర్మాణం ఎలా...?**

స్థానిక ప్రజలు తెలిపిన వివరాల మేరకు దాసరి సన్యాసి శెట్టి వద్ద బినామీ పేరు మీద రిజిస్టర్ సేల్ డీడ్ ద్వారా సిరిపురపు సురేష్ , బంటుబిల్లి మహేష్ కొనుగోలు



చేసిన భూమి కేవలం 53 గజాలు మాత్రమే. అయితే ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న నిర్మాణం దాదాపు 350 గజాలకు పైగా విస్తరించింది. పూర్వం నుంచి పారుతున్న కాలువను గుట్టు చప్పుడు కాకుండా కప్పేసి నిర్మాణం చేస్తున్నారు. ఇదే విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకి ఫిర్యాదు చేశారు.

**టౌన్ ప్లానింగ్ ఔదార్యం..!**

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల పరిశీలనలో ఈ అక్రమ నిర్మాణం ఎందుకు బయటపడలేదు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. భవనం నిర్మాణం అనంతరం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి ఔదార్యానికి ఫ్లాట్లు బహుమానంగా సమర్పిస్తున్నారని స్థానికులు గుసగుసలాడుతున్నారు. నజరానాలకు ఫిదా అయిన టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్ళు మూసుకుని చూస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

**పర్యవేక్షణ లోపం..?**

ఆక్రమణదారులు పునాదులు వేసేటప్పుడు.. పిల్లర్లు నిలిపేటప్పుడు.. స్లాబ్ వేస్తున్నప్పుడు.. రెండో అంతస్తు నిర్మాణం జరుగుతున్నప్పుడు.. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగానికి కనిపించలేదా? లేదా కనిపించినా స్పందించలేదా...అనేదే ఇప్పుడు ఆసక్తిగా మారింది. ఈ నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదులు, స్థానికుల అభ్యంతరాలు, భూ యాజమాన్య వివాదాలు వంటివి ఉన్నప్పటికీ స్థానిక అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు కమిషనర్ ను ప్రశ్నిస్తున్నారు.

**ఏసిపి పరిశీలన చేశారా ?**

ప్లాన్ మంజూరు చేసే ప్రక్రియలో ఫీల్డ్ వెరిఫికేషన్, స్థల విస్తీర్ణం, కొలతలు, భూ యాజమాన్య హక్కు పరిశీలన



వంటివి జరిగాయా...ఆక్రమణదారులు సమర్పించిన సర్వే రిపోర్టతో స్థలం కొలతలు సరిపోయయా...ఈ వ్యవహారంలో ఫీల్డ్ ఇన్ స్పెక్షన్ నిజంగా జరిగిందా...జరిగితే నివేదికలో ఏముంది. స్థల విస్తీర్ణం ఎలా నిర్ధారించారు...నిర్మాణం అనుమతులకు అనుగుణంగా ఉందని ఎవరు ధృవీకరించారు...ఇలా అనేక ప్రశ్నలు స్థానిక ప్రజలను వెంటాడుతున్నాయి. జీవీఎంసీ కమిషనర్ ఈ అనధికార నిర్మాణ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమ నిర్మాణం తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ముఠా ఆగడాలు..!**

సింహాచలం ప్రాంతంలో సిరుపురపు సురేష్ , బంటుబిల్లి మహేష్ బృందం ముఠాగా ఏర్పడి ప్రభుత్వ, ప్రైవేటు, చివరకు పారే కాలువలు ఏది వదలకుండా భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పోలీస్ స్టేషన్లో సివిల్ సెటిల్మెంట్లు చేస్తూ రాజకీయ నాయకులు అండదండలు ఉన్నాయంటూ అధికారులను "మామూళ్ళు"గా కలుస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆక్రమణదారులైన సిరిపురపు సురేష్, బంటుబిల్లి మహేష్ లు సింహాచలం దేవస్థానం కార్యాలయం ఎదురుగా మందుబాబులకు డెన్ నడుపుతున్నారని స్థానికులు అంటున్నారు. వీరిరువురిపై తెలంగాణ, ఆంధ్రాలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. కర్ణాటకలో కూడా వీరి చీకటి సామ్రాజ్యం విస్తరించాలని ప్రయత్నించగా అక్కడి ప్రజలు ఎదురు తిరగడంతో తోక ముడిచారు. అవినీతి అధికారుల సైతం వీరికి వత్తాసు పలకడంతో వీరి ఆగడాలకు హద్దే లేకుండా పోతుందని స్థానిక ప్రజలు విస్తుపోతున్నారు.



## సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

**చోడవరం జూన్ 19 జయ జయహే**

చోడవరం నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు పాల్గొని నియోజకవర్గం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యలను తెలుసుకుని, వారికి ధైర్యం చెబుతూ భరోసానిచ్చారు. అర్జీలన్నింటినీ పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





## ఇంటింటి సర్వేతో ఓటర్ల జాబితా నవీకరణకు శ్రీకారం

**విశాఖపట్నం జయ జయహే**

విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం ఎంవిపి కాలనీ సెక్టర్ 6 ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా కచ్చితంగా రూపొందించే లక్ష్యంతో ప్రత్యేక ఇంటింటి సర్వే గత కొద్దిరోజుల నుండి ఎస్ ఐ ఆర్ చేపట్టబడింది ఈ సర్వే ద్వారా అర్హులైన ప్రతి ఓటరు వివరాలను సేకరించి కొత్త ఓటర్లను నమోదు చిరునామా మార్పులు మరణించిన వారి పేర్లు తొలగింపు వంటి ప్రక్రియలను నిర్వహించనున్నారు అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్లల వివరాలను పరిశీలిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ప్రతి పౌరుడు తమ వివరాలను సక్రమంగా అందించి ఓటర్ల జాబితా నవీకరణకు సహకరించాలని ఓటరు జాబితా కీలకమన్నారు ఓటర్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమంలో బిఎల్ఓ ప్రినీ దుబ బి ఎల్ ఎ రాజేష్ పాల్గొన్నారు

# సురభి నాటకాలు గిన్నిస్ రికార్డులో నమోదు కావాలి







## పైడా కృష్ణ ప్రసాద్

**విశాఖపట్నం (జయ జయహే)**

సురభి నాటకాలు గిన్నిస్ రికార్డులో నమోదు కావాలని పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మించి నాటక ప్రదర్శనలు ఇస్తున్న సురభి సంస్థలు తెలుగు జాతికి వరం అని కొనియాడారు. కళాభారతిలో భానోదయ నాట్యమండలి నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాల నాలుగో రోజు శుక్రవారం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సురభి కళను ప్రోత్సహించవలసిన బాధ్యత అందరికీ ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలోనగర్ మాజీ డిప్యూటీ మేయర్దాడి సత్యనారాయణ, రంగస్థల నటులు మీగడ రామలింగ స్వామి, చలసాని కృష్ణ ప్రసాద్ కొరిటాల ప్రభాకర్, ఉత్తరాంధ్ర రంగస్థల కళాకారుల సంఘం కార్యదర్శి వంకాయల మారుతి ప్రసాద్, కళాపోషకులు నమ్మి అప్పలరాజు, గాయని మణి పల్లవి, బిల్డర్ రామకృష్ణ , రిటైర్డ్ ఏసీపీ మహమ్మద్ ఖాన్, సురభి నాటకోత్సవాల సంధానకర్త ప్రముఖ రంగస్థల నటి శివ జ్యోతి భానోదయ నాట్య మండలి కోఆర్డినేటర్ భాను ప్రసాద్ పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ నాగనబోయిన నాగేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

**భూకైలాస్ నాటకం ... దర్శకత్వం ఆర్ నాగబాబు**

రక్ష రాజు రావణుడు ఇంద్రుని స్వర్గపు రాజ్యం యొక్క రాజధాని అమరావతిని ఆక్రమించాలని నిర్ణయించుకున్నాడు. రావణుడి ప్రణాళికలకు భయపడిన ఇంద్రుడు నారదుని సహాయం కోరతాడు. రావణుడి తల్లి కైకసి చేసే పూజల వల్ల రావణుడి బలం వస్తుందని నారదుడు ఇంద్రుడికి తెలియజేసాడు. శివుని ఇసుక శిల్ప ప్రాతినిధ్యమైన సైకత లింగానికి రావణుడి తల్లి పూజను ఇంద్రుడు విధ్వంసం చేయాలని అతను సూచిస్తున్నాడు.

రావణుడు తపస్సు చేసి శివుని ఆత్మ లింగాన్ని తన తల్లి కోసం తీసుకురావాలని నిర్ణయించుకున్నాడు. రావణుని కోరికను తీర్చడానికి శివుడు రావణునికి కనిపించినప్పుడు, విష్ణువు రావణుడి మనస్సును తారుమారు చేసి, పార్వతీ దేవిని కోరుకునేలా చేస్తాడు. రావణుడు పార్వతి దేవితో ఇంటికి వెళుతుండగా, నారదుడు అతనిని మార్గమధ్యంలో కలుసుకున్నాడు మరియు అతని సహచరుడు భూతమును చూపించి పార్వతి అని చెబుతాడు. కుయుక్తితో విసిగిపోయిన రావణుడు తిరిగి కైలాసం చేసుకొని శివునిని ప్రశ్నిస్తాడు శివునిని ప్రశ్నించి మరల తపస్సు చేసి వరమును పొందుతాను అని అక్కడినుండి వెళ్ళిపోతాడు. ఇంతలో పార్వతి దేవి కైలాసానికి వస్తుంది నారదుడి నుండి ప్రణాళికలను విని, శివుని సతీమణి అయిన పార్వతి దేవి విష్ణువును శపిస్తుంది. రావణుడు తిరుగు ప్రయాణంలో పాతాళ యువరాణి మండోదరిని కలుస్తాడు. ఆమె నిజమైన పార్వతి దేవి అని నమ్మి, ఆమెను వివాహం చేసుకున్నాడు. చివరికి, అతను ఏమి జరిగిందో గ్రహించి, మరల తపస్సు చేసి శివుని దర్శించుకుంటాడు క్షమించమని శివుడిని వేడుకున్నాడు. పరమశివుడు రావణుడికి ఆత్మలింగాన్ని అందజేసి, ఆత్మలింగం ఎప్పుడైనా భూమిని తాకితే, అది మళ్లీ కదలదని హెచ్చరించాడు. నారదుడు వినాయకుడిని ప్రేరేపిస్తూ రావణుడిని మోసగించి ఆత్మలింగాన్ని నేలమట్టం చేశాడు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్సిసి సేవలు పునరుద్ధరణ జరిగేనా

### యువతకు దేశభక్తి ఆలోచనలు ఎంతో అవసరం

### 13 ఏళ్లుగా ఎన్సిసి అంశం ఊసే లేదు

**టెక్కలి జూన్ 19 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత 13 ఏళ్లుగా ఎన్సిసి నేషనల్ క్యాడెట్ కార్ప్స్ పథకం అమలులో లేక విద్యార్థులు దేశభక్తి సంబంధిత అంశాలకు దూరమవుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు సైన్యం సేవల హితవరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్కలి పట్టణ కేంద్రంలో ఎంతో ప్రాధాన్యత గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి ఎ, బీకాం, బిఎస్సి కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు ఎన్సిసి సేవలు లేక పోవడం విద్యార్థులు, విద్యావంతులు, తల్లిదండ్రులు వాపోతున్నారు, భారతదేశ భవిష్యత్తు ఆశయ సంపదలైన విద్యార్థులు యువత క్రమశిక్షణ దేశభక్తి తో మంచి పౌరులుగా త్రివిధ దళాలైన భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళాల్లో చేరి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ప్రాథమిక అంశాలు ఎన్సిసి లో ద్వారా శిక్షణ పొందిన యువత విద్యార్థుల భవిష్యత్తు కు ఎన్సిసి ఎంతో ప్రయోజనకరమని దీన్ని మళ్లీ పునరుద్ధించాలని ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు స్థానికులు కోరుతూ ఉన్నారు.



## కుటుంబ కలహాలతో ముగ్గురి మృతి

### రోదిస్తున్న మృతురాలి తల్లి అన్నపూర్ణ

### సమాజంలో ఆపలేని క్షణికావేశ మరణాలు

**టెక్కలి జూన్ 19 జయ జయహే**

సమాజంలో ఆపలేని ఆగని క్షణిక ఆవేశ మరణాలకు ఎందరో ఆడవాళ్ళు అమాయక పసిపిల్లలు బలవుతున్నారు, ఈ సంఘటన చూసిన పలువురికి హృదయ విదారక దృశ్యం తమ హృదయాలను బరువెక్కించింది, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలం తర్లిపేట పంచాయితీ చలమయ్యపేట గ్రామానికి చెందిన గేదెల పూజిత (35) ఆమె కుమారుడు కుశాంత్ ( 8 ) కుమార్తె దీక్షిత (6 )పలాస రైల్వే స్టేషన్ గేట్ సమీపంలో రైలు క్రింద పడి మృతి చెందారు, కుటుంబ కలహాలే కారణాలుగా మృతురాలి తల్లి అన్నపూర్ణ రోధిస్తూ మీడియాకు తెలిపారు, మృతురాలు పూజిత తన కొడుకు, కుమార్తెతో గురువారం ఉదయాన్నే చలమయ్యపేట అత్తవారి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిపోయి రాత్రంతా పలాస రైల్వే స్టేషన్ లో పిల్లలతో నిద్రపోయి శుక్రవారం ఉదయం ఆమె పిల్లలతో సహా రైలు కిందపడి ప్రాణాలు తీసుకున్నారు. జరిగిన సంఘటనపై ప్రభుత్వ రైల్వే శాఖ పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో క్షణికావేశాలు, వేధింపులు, ఆర్థిక ఇబ్బందులు, అవమానాలతో చాలా కుటుంబాలు మృత్యువాత పడుతున్నారు, సమాజంలో ఇటువంటి వారి కోసం సమగ్రమైన కుటుంబ కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి పలువురి ప్రాణాలను రక్షించాలని ప్రభుత్వాన్ని స్థానికులు కోరుతున్నారు.



## పుణ్యజీవన హేతువు నలదమయంతులకథ

### గోపూజతో ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**నంద్యాల (జయ జయహే)**

మహాభారతంలోని అరణ్య పర్వంలో పాండవులు విన్న కథలలో బృహదశ్వ మహర్షి చెప్పిన నలదమయంతుల కథ, నమ్మకం ఉన్న వారికి శ్రవణమాత్రం చేతనే కలి దోషాలను హరిస్తుందని ప్రవచనకర్త డా. బోలుగద్దె అనిల్ కుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ ఆధ్వర్యంలో నంద్యాల మండలం, పెద్ద కొట్టాల గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంనందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలలో భాగంగా వారు నాలుగవరోజు వారు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ పాపాలను, కలిబాధలను తొలగించి పుణ్యజీవితం కలగడానికి నలదమయంతుల కథలోని సందేశం అన్ని కాలాల్లోని ప్రజలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని, నలదమయంతులు పవిత్రమైన జీవనం వలననే ఋతుపర్ణ మహారాజు గారి దైవికవిద్య, కర్కోటకుని నాగశక్తి అనుకూలించి నలదమయంతులకు కలిబాధలు తొలగిపోయాయని , మనం పవిత్రమార్గంలో ప్రయాణిస్తే ప్రకృతి, దైవం మనకు అనుకూలిస్తుందని, పవిత్రమైన జీవనం చేసే వారికి తాత్కాలిక కష్టాలు తొలగి శాశ్వత సుఖాలు కలుగుతాయని అన్నారు. కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాసు స్వామి, శ్రీరామాలయం కమిటీ చైర్మన్ అన్నెపురెడ్డి నాగప్రసాద్ రెడ్డి, గండా బాలశివారెడ్డి, సుబ్బారావు, రాముడు, పెద్ద వీరయ్య, లక్ష్మీదేవి, ఈశ్వరరావు, కుమ్మరి మద్దిలేటి, ఎస్. ఎఫ్. ఎఫ్. మహిళా ప్రతినిధి ఇందిరాదేవి, బి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాల దుష్పరిణామాలుపై విద్యార్థులకు అవగాహన

**చోడవరం జూన్ 19 జయ జయహే**

విద్యార్థులకు మత్తుపదార్థాల దుష్పరిణామాలపై శుక్రవారం చోడవరం ఉషోదయ డిగ్రీ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యపరంగా, సామాజికంగా, ఆర్థికపరంగా కలిగే నష్టాలను వివరించారు. ముఖ్యంగా యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, స్నేహితుల ఒత్తిడికి లోనుకాకుండా తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు.మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబం సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా సమాచారాన్ని ఎక్సైజ్ స్టేషన్ చోడవరశీ వారికి అందించి సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్-ఫ్రీ సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ఎన్ నాయుడు ఎక్సైజ్ ఎస్సైలు ఎం శేఖరం, కే హనుమంతు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## పిడుగుపాటు ఒక వ్యక్తి గురి

**మాడుగుల జూన్ 19 జయ జయహే**

మాడుగుల మండలం జేడీపేట చెరువులో శుక్రవారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న సమయంలో దగ్గరలో పిడుగు పడింది. దీంతో పనికి వెళ్ళిన జెడి పేటకు చెందిన శ్రామికుడైన కొండలరావు పిడుగుపాటుకు గురయ్యాడు. వెంటనే అతడిని చోడవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా తగు చికిత్సలు అందించారు. ఆయన క్షేమంగా ఉన్నారు. ఈ సంవత్సరం అందుకున్న మాడుగుల ఎం డి ఓ కే అప్పారావు, ఏవో గోపాలరావు తదితరులు ఆసుపత్రికి వెళ్లి పిడుగుపాటుకు గురైన కొండలరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుగా ఉందని ఎండిఓ తెలిపారు.

# స్వర్ణాంధ్ర విజన్: అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్


(సి.హెచ్.ప్రతాప్)

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర 2047 విజన్ కేవలం ఒక అభివృద్ధి ప్రణాళిక మాత్రమే కాదు; రాష్ట్ర భవిష్యత్తుకు రూపొందించిన సమగ్ర రోడ్‌మ్యాప్. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌ను సంపన్నమైన, సమ్మిళితమైన, ప్రపంచస్థాయి పోటీతత్వం కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పం ఈ విజన్‌లో ప్రతిబింబించింది. ముఖ్యంగా యువత, రైతులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, మహిళలు మరియు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇది అపార అవకాశాలను అందించే దిశగా రూపొందించబడింది.**

ఈ విజన్‌లో అత్యంత ప్రాధాన్యత పొందిన అంశం మానవ వనరుల అభివృద్ధి. సున్నా పేదరికం, భారీ స్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్య సేవలు వంటి అంశాలు రాష్ట్ర అభివృద్ధికి పునాదులుగా నిలవనున్నాయి. కృత్రిమ మేధస్సు, క్వాంటం టెక్నాలజీ, డీప్‌టెక్ వంటి భవిష్యత్ రంగాల్లో యువతకు శిక్షణ అందించడం ద్వారా ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన మానవ వనరులను ఆంధ్రప్రదేశ్ తయారు చేయగలదు.

వ్యవసాయ రంగంలో కూడా ఈ విజన్ విప్లవాత్మక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. అగ్రిటెక్ ఆధారిత వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, నీటి నిర్వహణ, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచగలవు. రైతు కేవలం పంట పండించే వ్యక్తిగా కాకుండా వ్యవసాయ పారిశ్రామికవేత్తగా ఎదిగే పరిస్థితులు ఏర్పడతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం ద్వారా సమతుల అభివృద్ధి సాధ్యమవుతుంది.


లాజిస్టిక్స్ రంగం ఆంధ్రప్రదేశ్‌కు మరొక గొప్ప



అవకాశాన్ని అందిస్తోంది. పొడవైన తీరప్రాంతం, నౌకాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు రాష్ట్రానికి సహజమైన బలాలు. ఈ విజన్ ద్వారా రహదారులు, రైల్వేలు, పోర్టులు, గిడ్డంగుల మౌలిక సదుపాయాలు మరింత అభివృద్ధి చెందితే ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రధాన వాణిజ్య కేంద్రంగా అవతరించే అవకాశం ఉంది. ఇది దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు లక్షలాది ఉద్యోగాలను సృష్టించగలదు.

గత రెండు సంవత్సరాల్లో రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగిన రాష్ట్రం, స్థిరమైన విధానాలు మరియు పారదర్శక పాలన ద్వారా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత పెంచగలదు. పరిశ్రమలు పెరిగితే ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. సేవారంగం, తయారీ రంగం, సాంకేతిక రంగం సమాంతరంగా అభివృద్ధి చెందడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది.

డిజిటల్ పాలనకు ఈ విజన్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. రియల్ టైమ్ గవర్నెన్స్, కృత్రిమ మేధస్సు ఆధారిత విశ్లేషణ, ముందస్తు అంచనా వ్యవస్థలు పాలనను మరింత సమర్థవంతంగా మార్చగలవు. ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా చేరడంతో పాటు పారదర్శకత పెరుగుతుంది. డిజిటల్ కనెక్టివిటీ గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించడం ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు ప్రజలకు మరింత చేరువ అవుతాయి.



అదేవిధంగా ప్రతి కుటుంబానికి గృహం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, వంటగ్యాస్, డిజిటల్ కనెక్టివిటీ వంటి ప్రాథమిక అవసరాలను అందించాలనే లక్ష్యం సామాజిక న్యాయాన్ని బలోపేతం చేస్తుంది. సమాజంలోని ఉన్నత వర్గాలు వెనుకబడిన కుటుంబాలకు చేయూతనిచ్చే పి-4 మార్గదర్శి--బంగారు కుటుంబం కార్యక్రమం సామాజిక భాగస్వామ్యానికి కొత్త అర్థాన్ని ఇస్తుంది.

స్వర్ణాంధ్ర 2047 విజన్ విజయవంతమైతే ఆంధ్రప్రదేశ్ కేవలం అభివృద్ధి చెందిన రాష్ట్రంగానే కాకుండా, జ్ఞానం, సాంకేతికత, పారిశ్రామికత మరియు సమగ్ర సంక్షేమం కలగలిపిన ఆదర్శ రాష్ట్రంగా నిలిచే అవకాశం ఉంది. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రజలు కలిసి ముందుకు సాగినప్పుడే స్వర్ణాంధ్ర కల సాకారం అవుతుంది. అదే సమయంలో ఈ విజన్ దేశం కలలుగంటున్న వికసిత భారత్ 2047 లక్ష్యానికి కూడా బలమైన తోడ్పాటుగా నిలుస్తుంది.


# అబ్బో ఎంతో రుచి...ఎంతో రుచో...చింత చిగురు...!!!

## సీజనల్ పళ్ళు, కాయలు ఆరోగ్యానికి ఫల ప్రదం

(పుట్టా శ్రీనివాసరావు)

**మనకు ఆయా ఋతువు లో దొరికే పండ్లు, కాయలు అన్ని తినాలి..అపుడే మన శరీరంలో ఇమ్యూనిటీ అనేది పెరుగుతుంది.. జూన్ లో దొరికే చింతచిగురును అసలు వదులుకోకండి... దాని వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకోండి... చింత చచ్చినా పులుపు చావలేదు... అన్న సామెతను మీరు వినే ఉంటారు. ఆయా సందర్భాల్లో దీన్ని మనం పోలిక కోసం ఉపయోగిస్తుంటాం. అయితే పులుపు సంగతి ఎలా ఉన్నా చింతను తీసుకోవడం వల్ల మనకు ఆరోగ్యకర ప్రయోజనాలే కలుగుతాయి. ప్రధానంగా ఈ కాలంలో విరివిగా లభ్యమయ్యే చింత చిగురుతో ఎన్నో లాభాలు ఉన్నాయి. రుచికరమైన ఆహారంగానే కాక దీన్ని తినడం వల్ల మనకు ఆరోగ్యం కూడా కలుగుతుంది. ఈ క్రమంలో చింత చిగురును నిత్యం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం.**

చింత చిగురులో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. దీంతో ఇది సహజ సిద్ధమైన లాక్సేటివ్గా పనిచేసి విరేచనం సులభంగా అయ్యేలా చేస్తుంది. మలబద్ధకం సమస్య తొలగిపోతుంది. పైల్స్ ఉన్న వారికి కూడా చింత చిగురు బాగానే పనిచేస్తుంది. ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు




ఎక్కువగా ఉండడం వల్ల చింత చిగురు చెడు కొలెస్ట్రాల్ను తగ్గించి అదే క్రమంలో మంచి కొలెస్ట్రాల్ను పెంచుతుంది. వణుకుతూ వచ్చే జ్వరం తగ్గాలంటే చింత చిగురును వాడాలి. ఎందుకంటే ఇందులోని ఔషధ కారకాలు వైరస్ ఇన్ఫెక్షన్లపై పోరాడుతాయి. చింత చిగురును ఉడికించిన నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్ఫ్లామేటరీ గుణాలు చింత చిగురులో ఉన్నాయి. వేడి వేడి మసాలా పదార్థాలు తినడం వల్ల నోటిలో వచ్చే పగుళ్లు, పూతలను చింత చిగురు తగ్గిస్తుంది. గుండె జబ్బులు రాకుండా చూస్తుంది. శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు చింత చిగురులో ఉన్నాయి.కడుపులో నులి పురుగుల సమస్యతో బాధ పడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది.జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలో చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది.చింత చిగురులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధి లభిస్తాయి. ఇందువల్ల ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. యాంటీ సెప్టిక్, యాంటీ వైరల్ గుణాలు దీంట్లో ఉన్నాయి.పలు రకాల క్యాన్సర్లు రాకుండా చూసే ఔషధ గుణాలు చింత చిగురులో ఉన్నాయి.తరచూ చింత చిగురును తింటే ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి.థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న వారు చింత చిగురును తమ ఆహారంలో భాగం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.డయాబెటిస్ ఉన్న వారు కూడా చింత చిగురును వాడవచ్చు. ఇది వారి రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.ఆల్కహాల్ను ఎక్కువగా సేవించడం వల్ల కలిగే హ్యాంగోవర్ నుంచి ఉపశమనం కలిగేలా చేస్తుంది.చింత చిగురును పేస్టు చేసి దాన్ని కీళ్లపై ఉంచితే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి. ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్న వారికి ఇది మేలు చేస్తుంది.శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపే గుణాలు చింత చిగురులో ఉన్నాయి. ఇది యాంటీసెప్టిక్‌గా పనిచేస్తుంది. నేత్ర సంబంధ సమస్యలను కూడా చింత చిగురు దూరం చేస్తుంది. కళ్లు దురదగా ఉన్నప్పుడు కొంత చింత చిగురు తింటే ఉపశమనం కలుగుతుంది.



## సమస్యల సుడిగుండంలో బొందుగూడ: రోడ్డు, నీటి కోసం గిరిజనుల పోరు

**అరకులోయ/జయ జయహే.**

దేశానికి స్వతంత్రం వచ్చి 78 ఏళ్లు పూర్తవుతున్నా, మారుమూల గిరిజన గ్రామాల కష్టాలు మాత్రం తీరడం లేదు. అరకులోయ మండల కేంద్రంలోని మాదల పంచాయతీ పరిధిలో ఉన్న బొందుగూడ గ్రామం నేటికీ కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. రహదారి, త్రాగునీటి సమస్యలతో గ్రామస్తులు అష్టకష్టాలు పడుతున్నారు.గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం సంభవిస్తే, ఆసుపత్రికి వెళ్లడం గిరిజనులకు ఒక యజ్ఞంలా మారింది. గ్రామానికి మెయిన్ రోడ్డుకు సంబంధించి కనీసం రెండు కిలోమీటర్ల దూరం వరకు రహదారి సౌకర్యం లేకపోవడంతో, రోగులను డోలీలలో మోసుకుంటూ ప్రధాన రహదారి వరకు తీసుకురావాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డు లేకపోవడంతో అంబులెన్స్ కూడా గ్రామానికి రాలేని పరిస్థితి ఉంది.



అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం ఈ దుర్భర పరిస్థితిపై పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా, ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా తమ తలరాతలు మారడం లేదని వారు వాపోతున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సిపిఎం నాయకులు కుమ్మిడి రమేష్, పాంగి రామన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు మాదల గ్రామ సచివాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, తక్షణమే బొందుగూడ గ్రామానికి త్రాగునీటి వసతి కల్పించి, రహదారిని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అప్పన్న గోపాల్ చిక్కుడు అప్పలరాజు మల్లన్న, సింహాద్రి, కన్నయ్య, పండన్న, పోతురాజు, అప్పలమ్మ, కాంతమ్మ చిన్నమ్మ ,రాధమ్మ గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాక్సైట్ రహస్య సర్వేపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలి

## ఆదివాసీ గిరిజన సంఘం

**అరకులోయ/జయ జయహే**

అరకువేలిలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు గిరిజన సంఘం కార్యాలయం నుండి మెయిన్ రోడ్ మీదుగా ప్రదర్శన సాగింది అనంతరం జరిగిన నిరసన సభ వద్ద ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పల నరస మాట్లాడుతూజికివీధి మండలం జారెల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు రహస్యంగా బాక్సైట్ నమూనాలు సేకరిస్తున్న విషయం తెలిసి స్థానిక ఆదివాసి ప్రజలు తీవ్ర భయభ్రాంతికి గురవుతున్నారు. ఇటీవల ఒక సర్వే బృందాన్ని స్థానికులు అడ్డుకోవడం జరిగింది. , కేంద్రం-రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలతో చేసుకున్న చీకటి ఒప్పందాల ఫలితం.ఆదివాసి ప్రాంతాల్లో గ్రామసభల అనుమతి లేకుండా, ఆదివాసి హక్కుల చట్టం (పెసా), ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ వంటి రాజ్యాంగ హక్కులను ధిక్కరించి రహస్యంగా సర్వే చేపట్టడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. బాక్సైట్ ప్రాంతాల్లో జిల్లా అధికార యంత్రాంగం కళ్లు మూసుకుని అక్రమ కార్యకలాపాలకు అనుమతులు ఇస్తున్నట్లు సమాచారం వెలుగులోకి వస్తోంది. గ్రామసభల నిర్ణయాలను, ఆదివాసి మనోభావాలను పూర్తిగా విస్మరించడం దారుణం.రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే బాక్సైట్ రహస్య సర్వే అంశంపై స్పష్టమైన, అధికారిక ప్రకటన చేయాలి. రహస్య సర్వే చేస్తున్న వారిపై ఎట్రా సిటీకేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలి. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ రహస్య సర్వే నిర్వహిస్తున్న వారికి అనుమతించిన అధికారులను తక్షణమే బదిలీ చేయాలి. ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం అధికారులు పనిచేయకుండా కార్పొరేట్ కంపెనీల కోసం ఆదివాసులకు వ్యతిరేకంగా జిల్లా అధికారులు పనిచేయడం ఆదివాసులకు ద్రోహం చేయడమే. 1/ 70 చట్టాన్ని అటవీ హక్కుల చట్టాన్ని ఉ ల్లంగించడం ప్రభుత్వాన్ని తగదన్నారు ఆదివాసి ప్రజల భూములు, అడవులు, వనరులు వారి హక్కు. వీటిని కార్పొరేట్ లాభాల కోసం ధ్వంసం చేసే ప్రయత్నాలను ఆదివాసీ సమాజం సహించదు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఆదివాసి ప్రజల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మాన పడాల్ అరకు మండల కార్యదర్శి బుజ్జిబాబు, జిల్ల నాయకులు సూర్యనారాయణ,బాలయ్య, జగన్నాథం, గంగాధరం సోమల చిట్టిబాబు కిల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# చోడవరంలో రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**చోడవరం జూన్ 19**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21వ తేదీ ఉదయం చోడవరం మండల పరిషత్ కార్యాలయంలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించనునట్టు ఎండిఓ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లతోపాటు మండలంలో గల ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 21న ఆర్క సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి ప్రారంభం

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**



రాజమహేంద్రవరం లాలాచెరువు హౌ సింగ్ బోర్డు ఎదురుగా నిర్మించిన 'ఆర్క హాస్పిటల్స్ అండ్ ఎమర్జెన్సీ కేర్' సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని ఈ నెల 21వ తేదీ సాయంత్రం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ మొల్లేటి రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా అనురాగ్ చెస్ట్ కేర్ హాస్పిటల్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని, ఇప్పుడు అత్యాధునిక సౌకర్యాలతో 200 పడకల సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. కోవిడ్ సమయంలో ఎదురైన అనుభవాల నేపథ్యంలో రాజమహేంద్రవరంలోనే అన్ని రకాల ప్రత్యేక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.పల్మనాలజీ, కార్డియాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, ఈఎన్‌టీ, నేత్ర వైద్యం తదితర విభాగాలతో పాటు సీటీ స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్, క్యాథ్‌ల్యాబ్ వంటి అత్యాధునిక నిర్ధారణ సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 200 పడకల్లో 50 పడకలను ఐసీయూ, ఎస్ఐసీయూ, ఎన్ఐసీయూ, ఐసీసీయూ విభాగాలకు కేటాయించినట్లు చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించడమే లక్ష్యమని, ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్ఎస్‌తో పాటు వివిధ ఇన్సూరెన్స్ పథకాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఇకపై అనురాగ్ చెస్ట్ కేర్ సేవలను నిలిపివేసి ఆర్క హాస్పిటల్స్ నుంచే వైద్య సేవలు కొనసాగిస్తామని చెప్పారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు హాజరుకానున్నట్లు డాక్టర్ రామ్మోహన్ తెలిపారు.




# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**విశాఖపట్నం (జయ జయహే)**

లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 56 వ జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి ఆధ్వర్యంలో జెన్ జీ యువత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు . ప్రియాంక మాట్లాడుతూ రాహుల్ గాంధీ మీద యువతరం నమ్మకం పెట్టుకున్నారని, ఆయన ప్రధాని అయితేనే నీట్ విద్యార్థులకు న్యాయం జరుగుతుందని, ఉపాధి అవకాశాలు లభిస్తాయని యువత విశ్వసిస్తున్నారని ఆమె అన్నారు. విద్యావంతుడు ఈ దేశ ప్రధాని అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రియాంక అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాండవ గాయత్రి మరియు ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ డా. విజయ్ చంద్రా,28 వ వార్డు అధ్యక్షుడు గుర్రం కనకరాజు, 20 వ వార్డు అధ్యక్షులు భోగవరపు శ్రీనివాస్, ఆంధ్ర విశ్వ విద్యాలయం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరిణి పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్

**చోడవరం జూన్ 19 జయ జయహే**

దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో చోడవరంలో వేంచేసియున్న స్వయంభు శ్రీ గౌరీశ్వర స్వామి వారి దేవస్థానం పుష్కరిణి అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం పరిశీలించే సమీక్షించారు. ఈ సందర్భంగా పుష్కరిణి అభివృద్ధి గురించి ప్రస్తుతం జరుగుతున్న పనుల గురించి ప్రభుత్వం అందించిన గ్రాంటు, దాతలు అందిస్తున్న విరాళాలు వంటి వాటి గురించి స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు జిల్లా కలెక్టర్కు వివరించారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు వారు స్వయంభు గౌరీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి అనంతరం ఆలయ మండపంలో ఆశీర్వచనాలు అందజేశారు. దేవదాయ శాఖ మరి నిర్వహణ అధికారినీ కే.బి. ఆశాకిరణ్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది





# బూదరాళ్ల పంచాయతీ కులుకూరులో ఉచిత వైద్య శిబిరం

## 50 మందికి వైద్య సేవలు, వర్షాకాల వ్యాధులపై అవగాహన...

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ జూన్ 20**

అల్లూరి జిల్లా కొయ్యురు బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని కునుకూరు గ్రామంలో ఈరోజు రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జగదీష్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరానికి సుమారు 50 మంది గ్రామస్థులు హాజరయ్యారు. డాక్టర్ గారు హాజరైన వారందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ జగదీష్ గ్రామంలో కలియతిరిగి పరిస్థితులను పరిశీలించారు. జగదీష్ మాట్లాడుతూ గ్రామ మధ్యలో పశువుల పాకలు ఉండటం వల్ల, బురద నీరు నిల్వ ఉండటం వల్ల రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. పశువుల పాకలను ఊరికి దూరంగా ఉంచుకోవాలి. గ్రామ మధ్యలో బురద నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. రాబోయే వర్షాకాలంలో కలరా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరూ త్రాగు నీటిని తప్పనిసరిగా మరిగించి, చల్లార్చి త్రాగాలి. పరిసరాల పరిశుభ్రత పాటించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ప్రశాంత్ కుమార్, పి.హెచ్.ఎన్ భాగ్యవతి, హెచ్.వి భూలోక, హెల్త్ అసిస్టెంట్ రవి, ఏఎన్ఎంలు వెంకటలక్ష్మి, వరలక్ష్మి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొని సేవలందించారు.



# బీసీలపై కూటమి ప్రభుత్వం అణచివేత

## వైసీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

రాష్ట్రంలో బీసీలపై కూటమి ప్రభుత్వం అణచివేత ధోరణిని అవలంబిస్తోందని వైఎస్సార్‌సీపీ తూర్పుగోదావరి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు ఆరోపించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమై, రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు నమోదు చేస్తూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు.శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం వాటిని నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న సమయంలో అక్రమ మద్యం నియంత్రణకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌ను అన్యాయంగా కేసుల్లో ఇరికించారని ఆరోపించిన దుర్గారావు, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఇటువంటి చర్యలు జరుగుతున్నాయని అన్నారు. అదే సమయంలో డ్రగ్స్ కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఏలూరు ఎంపీపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఒకవైపు వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తుండగా, మరోవైపు అధికార పార్టీకి చెందిన వారిపై వచ్చిన ఆరోపణలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇది ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన అన్నారు.రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, బీసీలకు జరుగుతున్న అన్యాయాలను నియోజకవర్గాల వారీగా ప్రజల్లోకి తీసుకెళ్తామని దుర్గారావు స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ శ్రేణులను సమీకరించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని కొండపల్లి దుర్గారావు హెచ్చరించారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. అలాగే రూ.10,000 జరిమానా చెల్లించాలని, జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించింది.పోలీసుల వివరాల ప్రకారం, 2022 జనవరి 4న శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న చప్పిడి సునీల్ కుమార్‌ను డెన్వర్ విలియమ్స్, అతని భార్య మేరీ విలియమ్స్ కలిసి హత్య చేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ ఘటనపై ప్రకాష్‌నగర్ పోలీసులు క్రైమ్ నంబర్ 02/2022గా కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.అప్పటి సీఐ ఆర్.జే. రవికుమార్ కేసు నమోదు చేయగా, అనంతరం సీఐ పి.వి. త్రినాథ్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ పి.వి.వి.ఎస్.డి. రమేష్ సాక్షులను సమర్పించగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. కనక లింగేశ్వరరావు వాదనలు వినిపించారు.కేసును విచారించిన రాజమహేంద్రవరం ×౹ అదనపు జిల్లా న్యాయస్థానం-కమ్-ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి జి. షణ్ముఖరావు, నిందితుడు డెన్వర్ విలియమ్స్‌పై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు.కాగా, ఈ కేసులో రెండో నిందితురాలు మేరీ విలియమ్స్ 2022లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిశోర్, నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన సెంట్రల్ జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ ఎ. సుభాష్, ప్రకాష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎస్.కే. బాజీలాల్, కోర్టు కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కె. శ్రీనివాస్‌లను అభినందించారు.

# ఫోన్ యాప్ ద్వారా ఎరువుల సరఫరా విధానాన్ని రద్దు చేయాలి

**అనకాపల్లి జూన్ 19, జయ జయహే**



ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2026 జూన్ నెల ఎనిమిదో తేదీ నుండి ప్రారంభమైన , ఈ ఖరీఫ్ సీజన్లో యూరియా, డిఏపి ఎరువులు ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మానిటరింగ్ సిస్టం ( ఏపీఏఐ ఎంసి) యాప్ ద్వారా సరఫరా చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం అనకాపల్లి కార్మిక కర్షక భవనంలో సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు మాట్లాడుతూ రైతులు తమ ఫోన్ లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి అని కానీ ఆ విధంగా సామాన్య రైతులు ఎలా డౌన్లోడ్ చేసుకోగలరని మరి కొందరు సామాన్య రైతుల వద్ద, కీ ప్యాడ్ ఫోన్లు మాత్రం ఉంటాయని ఆండ్రాయిడ్ ఫోన్లు ఉండవని అలాగే నెట్ బాలన్స్ కూడా ఉ ండదని అలాంటప్పుడు ఆ యాప్ ను ఎలా డౌన్లోడ్ చేసుకోవాలో వారికి తెలియదని అంతేకాకుండా ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి భూమి వివరాలు తెలిపి గత సంవత్సరం ఈ క్రాప్ లో నమోదు అయ్యారో లేదో చూపించి ఆ ఏరియాలో ప్రభుత్వం వద్ద రికార్డులో నమోదు చేసుకున్న ఎరువుల డీలర్ల వద్ద మ్యాపింగ్ చేయించాలని రైతులు ఆ ధ్రువీకరణ చూపుతే డీలర్లు నిర్ణయించిన కోటమేరకు ఎరువులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం ఇది అత్యంత దారుణమని కేంద్ర ప్రభుత్వం ఎరువుల వాడకం తగ్గించాలని ఆదేశించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు గా పేర్కొన్నారు. రెండు ఎకరాలకు మూడు విడతలగా నాలుగు యూరియా, డి ఏ పి బస్తాలు ఇస్తామని ప్రభుత్వం ఈ విధంగా నిర్ణయం తీసుకోవడం సరైనది కాదని రైతుల అవసరాలకు తగ్గట్టుగా రైతు సేవా కేంద్రాలు ప్రాథమిక కో-ఆపరేటివ్ సహకార సంఘాల ద్వారా సరఫరా చేయాలని కౌలు రైతులకు సి సి ఆర్ సి, సిఓ సిలు ఉ ండాలంటున్నారు సిసిఆర్సి కార్డు లేకపోతే మండల వ్యవసాయ అధికారుల దివీకరణ పత్రం ఉండాలని లేకపోతే ఎరువులు ఇవ్వడం సాధ్యం కాదని ప్రభుత్వం ఈ యాప్ లో పొందుపరిచారు. సి సి ఆర్ సి కార్డులు ఎవరైనా అధికారులు ధ్రువీకరణ ఇవ్వడం సాధ్యం కాదని అని చెప్పి ఆటంకం పెడతారు, అలాంటి తరుణంలో కౌలు రైతులకు ఎరువులు ఏ విధంగా అందుతాయి దీని కారణంగా రైతులు బ్లాక్ మార్కెట్ పైన ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ప్రస్తుతం సరఫరా చేస్తున్న యూరియా 20060 రూపాయలు తీసుకోవాల్సి ఉంటుండగా ప్రైవేటు వ్యాపారులు (డీలర్లు) 350 రూపాయలు వసూలు చేస్తున్నారని దీనిని ప్రభుత్వం ఎందుకు అరికట్టడం లేదని, ఇది రైతులను దోపిడి చేయడం కాదా అని ఆయన ప్రశ్నించారు. రైతులకు కౌలు రైతులకు యూరియా డి ఏ పి ఎరువులు అందకుండా బ్లాక్ మార్కెటింగ్ ప్రోత్సహించే విధంగా రైతులకు కౌలు రైతులకు నష్టం కలిగించే విధంగా తీసుకువచ్చిన ఈ యాప్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఎరువులు వాడకం తగ్గించాలంటూందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యూరియా వాడితే క్యాన్సర్ వస్తుందని ప్రచారం చేస్తున్నారని ఇదంతా సామాన్య రైతాంగాన్ని వ్యవసాయం నుండి దూరం చేయడానికి చేస్తున్న ప్రయత్నమని దీనిని రైతాంగం, ప్రజలు అంతా గమనించాలని ఈ యాప్ విధానాన్ని రద్దు చేసే విధంగా రైతులందరూ ఆందోళన చేయవలసిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గొర్రెలు మేకలు పెంపకం దారుల సొసైటీ జిల్లా చైర్మన్ జి శ్రీరామ్, ఎస్ వి నాయుడు, బి రంగారావు, ఎన్ నారాయణ, తేలయ్య బాబు, పి జగన్నాధ రావు, సూరిబాబు, నాగేశ్వరరావు, దేవుళ్ళు, ఎస్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వం

**రెండేళ్ల విజయోత్సవ సభలో ఎమ్మెల్యే**

**చోడవరం జూన్ 19 జయ జయహే**

ఎన్డీఏ మహాకూటమి ప్రభుత్వం రెండేళ్ల సుపరిపాలన నేపథ్యంలో శుక్రవారం చోడవరంలో నియోజకవర్గస్థాయి విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు మాట్లాడుతూ..సంక్షేమ అభివృద్ధి సమన్వయంతో రాష్ట్రాన్ని ప్రగతి పదంలో కూటమి ప్రభుత్వం నడిపిస్తుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని,ఎన్నికల హామీలన్నీ నూటికి గూడు శాతం అమలు చేస్తుందని చెప్పారు.ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడమే విజయోత్సవ సభల ప్రధాన లక్ష్యమన్నారు.ఒక చోడవరం నియోజకవర్గంలోనే గత రెండేళ్లలో వివిధ శాఖల నుండి 535 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు.ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్దాం... ప్రతిపక్షాన్ని పూర్తిగా తుడిచిపెడదాం అంటూ సభలో పిలుపునిచ్చారు. చోడవరం సీతారామ కళ్యాణమండపం లో ఈ సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంటు టిడిపి అధ్యక్షులు,హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు , జనసేన పార్టీ ఇంచార్జ్ వివిఎస్ఎన్ రాజు,బిజెపి జిల్లా నాయకులు,ఈర్ల శ్రీరామ్ మూర్తి,బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కందర్ప రమణమూర్తి నాలుగు మండలాల వివిధ హోదాల్లో గల ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## గోదావరిలో దూకిన ఎపి ఎస్పీ కానిస్టేబుల్

**గాలింపు చర్యలు ముమ్మరం**

**రాజమహేంద్రవరం : జయ జయహే**




జూన్ 19 :గోదావరి నదిలో ఎపి ఎస్పీ కానిస్టేబుల్ ఒకరు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. రాజానగరం మండలం శ్రీరాంపురానికి చెందిన చంద్రమళ్ళ వంశీ, గోదావరి రోడ్ కం రైల్వే బ్రిడ్జి నాలుగో పిల్లర్ వద్ద ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది.2020 బ్యాచ్కు చెందిన వంశీ, థర్డ్ బెటాలియన్లో కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తున్నారు. బ్రిడ్జిపైకి చేరుకున్న వంశీ, తన ద్విచక్ర వాహనాన్ని అక్కడే నిలిపివేసి, తన చెప్పులను కూడా బ్రిడ్జి పైనే వదిలి గోదావరి నదిలోకి దూకేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సహాయక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు.బ్రిడ్జిపై వాహనం, చెప్పులు లభ్యం కావడంతో వంశీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రస్తుతం నదిలో గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే, వంశీ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఈ ఘటనతో వంశీ కుటుంబ సభ్యులు, తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మానవత్వం చాటుకున్న సరస్వతి

**అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు సహాయం**

**తెనాలి (జయ జయహే)**

గుంటూరు జిల్లా, తెనాలి మండలం, అంగలకుదురు గ్రామం, కొత్త కాలువ సమీపంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిల్లు అగ్నికి అహుతి కావడంతో శ్రీ నాగారపమ్మ తల్లి సేవా సమితి రాయచోటి శివ ఆధ్వర్యంలో సరస్వతి పుట్టినరోజు సందర్భంగా బాధితులను పరామర్శించి అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, రెండు బియ్యం బస్తాలు, పిల్లలకు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు అందించారు. ఈ సందర్భంగా శ్రీ నాగారపమ్మ తల్లి సేవా సమితి, సభ్యులు మాట్లాడుతూ ఇలాంటి బాధాకరమైన సంఘటనలు జరగడం చాలా బాధాకరమని, ఇలాంటి వారికి శ్రీశ్రీశ్రీ నాగారపమ్మ తల్లి సేవా సమితి రాయచోటి శివ గ్రూప్ అండగా ఉంటుందని తెలిపారు.



## సమాజ సేవలో హెల్పింగ్ హాండ్స్

**విశాఖ జిల్లాలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు**

**మాడుగుల జూన్ 19 జయ జయహే**

విశాఖ గోపాలపట్నం కేంద్రంగా గత కొంతకాలంగా సమావేశాలు అందిస్తూ ఫ్రెండ్స్ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సంస్థ ప్రజల మన్ననలు పొందుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో గల విశాఖ అనకాపల్లి అల్లూరి జిల్లా ప్రాంతాల్లో వివిధ సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ తాజాగా శుక్రవారం అల్లూరు జిల్లాలో గల అరకు, పాడేరు, అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం ఎం కోడూరు, కురుమనాధ పురం, మాడుగుల ప్రాంతాల్లో గల పలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సుమారుగా 300 మంది విద్యార్థులకు పుస్తకాలు విద్యాసామాగ్రి కిట్లు పంపిణి చేసారు. ఈ సందర్భంగా సంస్థ చేస్తున్న కార్యక్రమాలను ఉపాధ్యాయులతో పాటు పలువురు పెద్దలు కూడా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పి మణికంఠ, సభ్యులు వి అవినాష్, బి పవన్, బి అరుణ తదితరులు పాల్గొన్నారు

## చిట్టెంపాడు పాఠశాలలో విద్యార్థులకు నూతన పాఠ్యపుస్తకాల పంపిణీ



**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ జూన్ 20**

అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం చిట్టెంపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు బి.చిన్నబ్బాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పుస్తకాల ప్రాముఖ్యతను వివరించారు. పాఠ్యపుస్తకాలను సక్రమంగా వినియోగించుకొని విద్యలో రాణించాలి. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోండి అని సూచించారు.స్కూల్ చైర్మన్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై క్రమశిక్షణతో చదువుకోవాలి అని పిలుపునిచ్చారు. కొత్త పుస్తకాలు అందుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.



## యుఎఫ్ఎస్ డేటాపై గ్రామ సభలు

**మాడుగుల జూన్ 19 జయ జయహే**

స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు పరిధిలో యు ఎఫ్ ఎస్ డేటా సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) ధృవీకరణ కోసం శుక్రవారం మండలంలో గల ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించారు. ఎండి ఒ కే అప్పారావు వివిధ గ్రామసభలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవల పారదర్శకత కోసం ఈ ధృవీకరణ ప్రక్రియ అత్యంత కీలకమైనదన్నారు. యు ఎఫ్ ఎస్ డేటా జాబితాను మన స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయంలో ప్రదర్శించడం జరిగిందన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు మీ కుటుంబ వివరాలను సరే చూసుకోవాలన్నారు. ఈ నెల 19 నుండి 26 వరకు ఫిర్యాదుల నమోదు చేయబడునని, మీ డేటాలో కులం, పేరు లేదా ఇతర వివరాలకు సంబంధించి ఏవైనా తప్పులు ఉన్నట్లయితే, సభలో తెలియజేయవచ్చన్నారు. లేదా సంబంధిత సిబ్బంది వద్ద సరైన ఆధారాలతో ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చన్నారు. ఆ తప్పులను విచారించి వెంటనే పరిష్కరించడం జరుగుతుందనీ తెలిపారు. మీ వివరాలు సరిగ్గా ఉంటేనే భవిష్యత్తులో ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుతాయన్నారు. ఈ సందర్భంగా మాడుగుల పంచాయతీలో గ్రామ కార్యదర్శి ఆర్ నాయుడు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అలాగే ఏం కోడూరు, కేజే పురం, ఎం కోటపాడు, వీరవిల్లి, ముకుందపురం, జేడీపేట,కింతలి, పొంగలిపాక, ఆవురువాడ, జాలంపల్లి, శంకరం, తాటిపర్తి, సాగరం తదితర అన్ని పంచాయతీల్లోనూ ఈ సభలు నిర్వహించారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు





**రాజమహేంద్రవరం:జయ జయహే :జూన్ 19:**

భారత పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ధవళేశ్వరంలో అత్యంత ఘనంగా జరిగాయి. రాజమహేంద్రవరం అర్బన్ జిల్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ టి.కె. విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ధవళేశ్వరం ఆనకట్ట వద్ద ఉన్న పేద మత్స్యకార మహిళల సమక్షంలో రాహుల్ గాంధీ జన్మదిన కేక్ను కట్ చేశారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది మహిళలకు చీరలు, పండ్లను పంపిణీ చేసి సేవా నిరతిని చాటుకున్నారు.ఈ సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ యువతకు ఆశాజ్యోతి అని, దేశ రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య బలోపేతానికి ఆయన సారథ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ భవిష్యత్తులో దేశ ప్రధాని కావాలని, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆకుల భాగ్యలక్ష్మి, తాళ్లూరి విజయకుమార్, సింధియా రాణి, తడల కొండరాజు, బర్రె సుబ్రహ్మణ్యం, తాడి సూరిబాబు, సత్యన్నారాయణ రాజు, ఉలిశెట్టి సత్తిబాబు, రాణి తదితరులు పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

# నా ధైర్యం పాయకరావు పేట ప్రజలే..!





## రెండేళ్లలో రూ. 650 కోట్ల అభివృద్ధి పనులు

### ఎన్డీఏ విజయోత్సవ సభలో హోం మంత్రి అనిత

### దొడ్డిగల్లు నుంచి వేంపాడు వరకు కూటమి కార్యకర్తలు ర్యాలీ

**నక్కపల్లి, జూన్ 19, జయ జయహే**

పాయకరావు పేట ప్రజలే నా బలం..ధైర్యం అని హోం మంత్రి అనిత అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గంలో శుక్రవారం విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి మండలం దొడ్డిగల్లు జంక్షన్ నుంచి వేంపాడు టోల్ ప్లాజా వరకు కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. అనంతరం భారతి కన్వెన్షన్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో హోంమంత్రి మాట్లాడుతూ తాను 2013 వరకు ఒక సాధారణ ఉపాధ్యాయినిగా పనిచేశానని, ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండానే ప్రజల ఆశీర్వాదంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. 2014-19 మధ్య ఎమ్మెల్యేగా పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, 2019-24 మధ్య ప్రజా సమస్యలపై పోరాటాలు చేశామని తెలిపారు. 2024 ఎన్నికల్లో పాయకరావుపేట ప్రజలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 47 వేల మెజారిటీతో గెలిపించారని గుర్తుచేశారు. ప్రజల ఆశీర్వాదం వల్లే మంత్రి పదవి దక్కిందని, ఎక్కడికి వెళ్లినా నియోజకవర్గ అభివృద్ధే తన ఆలోచన అని అన్నారు. రెండేళ్లలో పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని హోంమంత్రి వెల్లడించారు. ఆలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారని తెలిపారు. ఎన్నికల వరకు మాత్రమే పార్టీలు ఉంటాయని, ఎన్నికల అనంతరం అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమని హోంమంత్రి స్పష్టం చేశారు. విమర్శలకు భయపడేది లేదని, ప్రజల కోసం ఎన్ని అవమానాలైనా భరిస్తానని చెప్పారు. తన ధైర్యం పాయకరావుపేట ప్రజలు, రాష్ట్ర ప్రజలు, కూటమి నాయకత్వమేనని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో ఉమ్మడి విశాఖ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హోంమంత్రి అనిత ఎన్నో ప్రజా పోరాటాలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాయికృష్ణ లాకప్ డెత్‌పై ప్రత్యేక కమిటీ వేయండి

### వాస్తవాలు వెలికితీస్తాం: మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూన్ 19**



విజయవాడ సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో నిజానిజాలు సమాజానికి తెలియాల్సిన అవసరం ఉందని ఏపీ హైకోర్టు న్యాయవాది, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికీ స్పష్టత రాకపోవడం వెనుక రాజకీయ ప్రయోజనాలు దాగి ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో గతంలో కూడా పలు జిల్లాల్లో ఇలాంటి పోలీసు హత్యల ఆరోపణలు వెలుగుచూశాయని, రాజకీయ ఒత్తిడులు లేకుంటే రాష్ట్ర పోలీసులకు నిజాలను త్వరగా వెలికితీసే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు.రాజమండ్రిలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు హత్యకు గురైన ఘటనలో ఫిర్యాదులు, డైయింగ్ డిక్లరేషన్ ఉన్నప్పటికీ దర్యాప్తు ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శించారు.ప్రస్తుత రాష్ట్ర మానవ హక్కుల సంఘం పనితీరుపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఆ శాఖ ప్రజలకు ఉపయోగపడేలా పనిచేయడం లేదన్నారు. ఇంటెలిజెన్స్ విభాగం నివేదికలను కూడా రాజకీయ కారణాలతో ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయని చెప్పారు.సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల కారణంగా నిజాయితీగా పనిచేసే పోలీసు సిబ్బంది ప్రతిష్ఠ దెబ్బతింటోందన్నారు. చిత్తశుద్ధితో దర్యాప్తు జరిగితే ఈ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసులను మించే స్థాయిలో నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. విజయవాడ బార్ అసోసియేషన్ మానవ హక్కుల పరిరక్షణ కోసం ముందుకు రావడం అభినందనీయమని, న్యాయవాదులు న్యాయ వ్యవస్థకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలతో ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తే కేసు వాస్తవాలను వెలికితీసి ప్రజల ముందుంచగలమని మేడా శ్రీనివాస్ తెలిపారు.

## గ్రంథాలయానికి తాత్కాలిక భవనం కేటాయించండి...!

### కలెక్టర్‌ను కోరిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి

**విశాఖపట్నం, జూన్ 19, జయ జయహే**



జిల్లా గ్రంథాలయ సంస్థకు తాత్కాలికంగా ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్ భవనంలోని 5వ అంతస్తును కేటాయించవలసిందిగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ కోరారు. ఈమేరకు శుక్రవారం కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. దండు బజార్‌లోని మా స్వంత స్థలంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక వసతి కల్పించాలని విన్నవించారు. నగరంలో అందుబాటులో ఉన్న ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్(రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ఎదురుగా) భవనాన్ని పరిశీలించి కేటాయించాల్సిందిగా జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించిన నేపథ్యంలో తాను వ్యక్తిగతంగా భవనాన్ని సందర్శించి, పరిశీలించానని వెల్లడించారు. ఆ భవన సముదాయం జిల్లా కేంద్ర గ్రంథాలయ నిర్వహణకు, సంస్థ కార్యాలయ పనులకు సరిపోతుందని గుర్తు చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం అనేది పూర్తిగా సేవా దృక్పథంతో నడుపబడుతున్న ప్రభుత్వ సంస్థగా పేర్కొన్నారు. నగరంతో పాటు జిల్లా నలుమూలల నుండి వచ్చే ఎంతోమంది నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థులు ఇక్కడ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటారని, వారికి అవసరమైన ప్రశాంతమైన వాతావరణాన్ని, రీడింగ్ రూమ్ వసతిని కల్పించడానికి ఈ 5వ అంతస్తు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.



## హెడ్ మాస్టర్ వేధింపులపై గంటాకు ఫిర్యాదు

**విశాఖపట్నం, జూన్ 19:(జయ జయహే)**

చంద్రంపాలెం హైస్కూల్ హెడ్ మాస్టర్ వెంకట్రావు తమను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన్ను కలసిన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ హెడ్ మాస్టర్ తీరుతో ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. అకారణంగా సిబ్బందిని దూషిస్తున్నారని, మహిళా టీచర్లను కించపరుస్తూ మాట్లాడుతున్నారని తెలిపారు. హెడ్ మాస్టర్ మాటలు భరించలేక జూనియర్ అసిస్టెంట్ బదిలీ చేయించుకుని వెళ్లిపోయారని, ఇప్పుడు ఆ పని తాము చేయాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికే అనేకసార్లు వెంకట్రావుపై విచారణలు జరిగాయని, పైస్థాయి అధికారులు అండగా ఉండడం వల్ల ఆయన ఆగడాలకు అడ్డులేకుండా పోతోందని చెప్పారు. హెడ్ మాస్టర్ పై ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్ తో విచారణ చేయించారంటే జిల్లా అధికారులు సమస్యను ఎంత చిన్నదిగా చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. 82 మంది సిబ్బందిలో 70 మందికి పైగా హెడ్ మాస్టర్ ఏకపక్ష విధానాలను వ్యతిరేకిస్తూ చేసిన ఫిర్యాదును ఎమ్మెల్యేకు అందజేశారు. ఇదే ధోరణి కొనసాగితే ఒక్కరు కూడా పనిచేసే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధిక విద్యార్థులు చదువుతున్న చంద్రంపాలెం హైస్కూల్ రాష్ట్రానికే తలమానికమని, ఎలాంటి క్రమశిక్షణ రాహిత్యాన్ని సహించబోమని గంటా స్పష్టం చేశారు. సిబ్బంది ఫిర్యాదుపై నిజానిజాల నిగ్గు తేల్చి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ం



## గిరిజన కుటుంబాలకు జీవనోపాధి కల్పించండి

### విశాఖ పోర్టు అధికారులను కలిసిన ప్రతినిధి బృందం

### హామీ ఇచ్చిన పోర్ట్ డిప్యూటీ చైర్మన్ రోష్ని

**విశాఖపట్నం, జూన్ 19, జయ జయహే**

విశాఖపట్నంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన గిరిజన కుటుంబాల ప్రతినిధి బృందం, యన్.సతీష్, భవాని ప్రసాద్,యేసు (జానూ), ప్లాస్టిక్స్ ఫర్ చేంజ్ సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సత్యవేణి సాలిపల్లి ఆధ్వర్యంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరంజి కొరటి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజన కుటుంబాల జీవనోపాధి మెరుగుదలకు విశాఖ పోర్టు పరిధిలో వ్యర్థాల సేకరణ (వేస్ట్ పికింగ్) కార్యకలాపాలకు అనుమతి కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. వ్యర్థాల సేకరణ ద్వారా అనేక పేద మరియు గిరిజన కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రతినిధి బృందం వివరించింది. వారి వినతిని సానుకూలంగా స్వీకరించిన డిప్యూటీ చైర్‌పర్సన్ రోష్ని అపరంజి కొరటి సంబంధిత నిబంధనల మేరకు ఈ ప్రతిపాదనను పరిశీలించి సాధ్యమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం గిరిజన కుటుంబాల జీవనోపాధి అభివృద్ధికి ఒక సానుకూల ముందడుగుగా నిలిచింది. ప్రతినిధి బృందం తమ సమస్యలను వినిపించే అవకాశం కల్పించినందుకు డిప్యూటీ చైర్‌పర్సన్ కి కృతజ్ఞతలు తెలియజేసింది, ఈ కార్యక్రమం లో ప్రగతి శీల స్క్రాప్ వర్కర్స్ బృందం, సతీష్, భవాని ప్రసాద్, యేసు, శ్రీనివాస్, మార్క్ కోటయ్య, దయ, తదితరులు పాలొగొన్నారు...



## చేపల వేటకు వెళ్లి గెడ్డలో గల్లంతైన గిరిజనుడు

### ఆచూకీ కోసం ముమ్మర గాలింపు.. రెస్క్యూ బృందాన్ని ఏర్పాటు చేయాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలోని జోలాపుట్టు పంచాయతీ బొంద్రుగూడ గ్రామానికి చెందిన నరంజి అద్దు (45) అనే గిరిజనుడు చేపల వేటకు వెళ్లి గెడ్డలో గల్లంతైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం సాయంత్రం సమయంలో నరంజి అద్దు మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి బొంద్రుగూడ గెడ్డలోని బలిఘాట్ ప్రాంతానికి చేపల వేటకు వెళ్లాడు. చేపల కోసం వలలు వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గెడ్డలో గల్లంతైనట్లు అతనితో వెళ్లిన వారు తెలిపారు.సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్థులు నాటు పడవ సహాయంతో గెడ్డలో విస్తృతంగా గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. అనంతరం ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.గల్లంతైన వ్యక్తిని గుర్తించేందుకు ప్రత్యేక రెస్క్యూ బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు అధికారులను కోరుతున్నారు. నరంజి అద్దుకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.ఈ ఘటనపై స్థానిక ఎస్సై పి.నానిని వివరణ కోరగా, పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, త్వరలోనే అధికారిక సమాచారం వెల్లడిస్తామని తెలిపారు.గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అసంపూర్తి పాఠశాల భవనంతో విద్యార్థుల అవస్థలు



### జీపీఎస్ పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలి

### వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు రెడ్డి

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

ముంచంగిపుట్టు మండలం జర్జుల పంచాయతీ పరిధిలోని సిందిపుట్టు గ్రామస్థుల పిలుపు మేరకు వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు రెడ్డి గ్రామంలోని జీపీఎస్ పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి పాఠశాలను పరిశీలించిన ఆయన, పాఠశాల భవనం అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 42 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, ఒకే ఒక్క ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. భవనం సక్రమంగా లేకపోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో విద్యార్థుల చదువులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు.అందువల్ల ప్రభుత్వం తక్షణమే స్పందించి సిందిపుట్టు జీపీఎస్ పాఠశాలకు పూర్తి స్థాయి భవనాన్ని మంజూరు చేసి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గ్రామస్థులు, పాంగి పద్మారావు రెడ్డి కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని పద్మారావు రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెసా ఉపాధ్యక్షులు కోడా తిలక్, బూత్ ఇంచార్జి కోడా సాధురాం (మాజీ ఉపసర్పంచ్), కొర్రా కృష్ణారావు, పాల్సు, పాంగి కృష్ణారావు, నొందో, గ్రామ నాయుడు పాంగి శుక్ర, పాంగి సుబ్బారావు, జగదీష్, పోదలం, మాజీ వార్డు సభ్యులు గొల్లోరి గాసి, గొల్లోరి సుబ్బారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



For a pure tomorrow.. జయహే

# ఉన్నత శిఖరాలకు చేర్చే ఆయుధం విద్య: గంటా





**భీమిలి, జూన్ 19: (జయ జయహే)**

ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి చదువు ఒక్కటే బలమైన ఆయుధమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం భీమిలి కేజీబీవీ సందర్శించిన ఆయన ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందిస్తూ భవిష్యత్ లక్ష్యాన్ని హైస్కూల్ దశలోనే నిర్దేశించుకుని దానికి తగ్గట్టుగా శ్రమించాలన్నారు. వర్షపు చినుకుల్లాంటి విద్యార్థులు అల్చిప్ప లాంటి ఉత్తమ విద్యాసంస్థలు, టీచర్ల చెంతన చేరితే ముత్యాలుగా మారతారని చెప్పారు. కొత్త తరగతి గదులను త్వరలో ప్రారంభిస్తామని, ప్రహరీగోడ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంచి ఫలితాలు సాధించిన కేజీబీవీ టీచర్లకు, విద్యార్థినులకు గంటా అభినందనలు తెలియజేశారు. ఇంటర్ లో ఎక్కువ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినులు మాట్లాడుతూ భవిష్యత్ లో తాము జిల్లా కలెక్టర్, డాక్టర్ అవుతామన్నారు. విద్యార్థినులకు గంటా స్కూల్ యూనిఫారాల సహా బ్యాగులు,



పుస్తకాలు, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీడీ చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఎమ్మార్వో పి.రామారావు, ప్రిన్సిపాల్ గంగా భవాని, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, గంటా నూకరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, గొలగాని నరేంద్ర, కనకల అప్పలనాయుడు, చురకల రమణ, కె.రామానాయుడు, గరే గుర్నాథ్, గరికిన ఎల్లాజీ, సీహెచ్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**90 మంది దివ్యాంగులకు పరికరాల అందజేత**

భీమిలి భవిత కేంద్రంలో వివిధ రకాల వైకల్యాలతో బాధపడుతున్న 90 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, వాకర్స్, బ్రెయిలీ కిట్లు, వినికిడి యంత్రాల వంటి పరికరాలు అందజేశారు. దివ్యాంగులను చూసి మనసు కలచివేసిందని గంటా పేర్కొంటూ.. టీచర్లు, తల్లిదండ్రులు వారికి విద్యా బుద్ధులు చెప్పే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. వారిని ప్రేమతో సాకాలని చెప్పారు.

**షాదీఖానా ప్రారంభించిన గంటా**

తగరపువలసలో రూ. 56 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన షాదీఖానాను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం మైనారిటీలకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు. ముస్లిం స్మశాన వాటిక సమస్యను స్థానిక ముస్లిం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి జూన్, 19 జయ జయహే**

అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ మరియు విఎంఆర్ డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, విఎంఆర్ డి ఏ మెట్రోపాలిటీ న్ కమిషనర్ కే ఎస్ విశ్వనాథం శుక్రవారం కొత్తూరు పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడం జరిగింది. అధికారులతో ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ ఈ పార్కును అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ముఖ్యంగా వాకింగ్ ట్రాక్ సైకిల్ ట్రాక్ ఆకర్షణీయమైన గ్రీనరీ ప్రజలకు ఆహ్లాదకరం కలిగించాలా మంచి వాతావరణం ఉండే విధంగా సమగ్ర ప్రణాళికలతో పనులు చేపట్టాలని



అధికారులకు సూచించారు. అనంతరం అక్కడ నుండి స్థానిక రావు గోపాలరావు కళాక్షేత్రానికి వచ్చి అక్కడ జరుగుతున్న నిర్మాణ పరమత్తుల పనులను పరిశీలించి, సాంస్కృతి కార్యక్రమాలు కేంద్రంగా నిలిచే ఈ భవనాన్ని ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే ఎన్ హెచ్ 5 వైజాగ్ అనకాపల్లి బైపాస్ రింగ్ రోడ్డు సమీపంలో పార్క్ అభివృద్ధికి అనుకూలమైన ప్రదేశాన్ని పరిశీలించడం జరిగింది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందరికీ ఉపయోగపడని విధంగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని ఆయన అధికారులకు సూచించడం అనకాపల్లి నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు వినియోగ వనరులు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలు చెందిన అధికారులు, కూటమి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిభ గల పేద విద్యార్థులకు బాసటగా చేయూత ఫౌండేషన్

**కె.యస్. లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ**

**గుంటూరు (జయ జయహే)**



ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని, ప్రతిభ గల నిరుపేద విద్యార్థులు విద్యనభ్యసించేందుకు చేయూత ఫౌండేషన్ అండగా నిలుస్తుందని శాసనమండలి మాజీ సభ్యులు, చేయూత ఫౌండేషన్ కోశాధికారి కె.యస్. లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 19వ తేదీన గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో నిర్వహించిన సమావేశానికి చేయూత ఫౌండేషన్ వ్యవస్థాపకులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ నేటి పోటీ ప్రపంచంలో విద్య అత్యంత ప్రాధాన్యత కలిగి ఉందని, ప్రతిభ కలిగి ఉండి పేదరికంలో మగ్గుతున్న విద్యార్థులను గుర్తించి తమ సంస్థ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో దాతల భాగస్వామ్యంతో చేయూత ఫౌండేషన్ ను మరింత బలోపేతం చేసి సేవా కార్యక్రమాల పరిధిని విస్తృత పరిచేలా కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ పి.వి. రమేష్ చైర్మన్ గా ఏడాది క్రితం ఏర్పాటైన చేయూత ఫౌండేషన్ విద్య, వైద్య, ఉపాధి రంగాలలో సేవలందిస్తుందని, కనెక్ట్ పేరుతో గుంటూరు నగరంలో గల స్వచ్ఛంద సేవా సంస్థలన్నిటిని ఏకత్రాటి పైకి తీసుకొచ్చి దాతల సౌజన్యంతో గుంటూరు నగరంలో నిరు పేదరికాన్ని నిర్మూలించడానికి కార్యాచరణ చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఈ మహత్కార్యంలో విద్యార్థులను సైతం భాగస్వామ్యం చేస్తున్నట్లు తెలిపారు. చేయూత ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు టి. ధనుంజయ రెడ్డి ప్రసంగిస్తూ ప్రవాసాంధ్రులు రాష్ట్రంలో గల నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని వాళ్లకు బాసటగా నిలవాలని, ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు విద్య, ఉపాధి రంగాల్లో ప్రతిభను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులు, సేవా తత్పరులు తమ్మా నరేంద్ర రెడ్డి చేయూత ఫౌండేషన్ కు 50 వేల రూపాయల ఆర్థిక విరాళాన్ని సంస్థ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కు అందజేశారు. ఈ సమావేశంలో చేయూత ఫౌండేషన్ సలహాదారులు పోలూరి వీరారెడ్డి, మేకల రామారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## పోలీస్ అరాచకాలకు లెక్కలు రాస్తున్నాం

**అధికార మార్పు తర్వాత విచారణ చేసి చర్యలు తీసుకుంటాం: మార్గాని భరత్"**

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూన్ 19**

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనకు బదులుగా అటవిక రాజ్యం నడుస్తోందని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేయడంతో పాటు ఇళ్లలోకి వెళ్లి దాడులు చేస్తున్నారని వైఎస్సార్‌సిపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయాలుగా మారిపోయాయని, కొందరు పోలీస్ అధికారులు అధికార పార్టీకి తాబేదారులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మే నెలలో 23 ఏళ్ల యువకుడు పోలీస్ లాకప్‌లో చిత్రహింసలకు గురై మృతి చెందాడని, ఘటన జరిగిన నెల తర్వాత ముఖ్యమంత్రి స్పందించడం బాధాకరమన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వ పాలన జరుగుతోందా, ప్రజాస్వామ్య పాలన కొనసాగుతోందా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని భరత్ పేర్కొన్నారు. చట్టాలు, న్యాయస్థానాలు ఉన్నప్పటికీ పోలీసులు ఇళ్లలోకి వెళ్లి దాడులు చేయడం, వ్యక్తులను కొట్టి చంపడం దారుణమని విమర్శించారు.టిడిపి కార్యకర్తలకే ప్రాణహాని ఉంటే, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. హోంమంత్రి నియోజకవర్గ సమీపంలోని తుని ప్రాంతంలో రెండేళ్ల చిన్నారి అదృశ్యమై 15 రోజులు గడిచినా ఆచూకీ కనుగొనలేకపోవడం ప్రభుత్వం, పోలీసు శాఖ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉందని చెప్పుకునే పోలీసులు చిన్నారి జాడ కనిపెట్టలేకపోవడం విచారకరమన్నారు.చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పోలీస్ అధికారుల పేర్లను నమోదు చేస్తున్నామని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టపరమైన విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నగరానికి చెందిన వైఎస్సార్‌సిపి బిసి నాయకుడు పీతా రామకృష్ణ అరెస్టును ఖండించిన భరత్, ఆయన కుటుంబానికి పార్టీ పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ మీడియా సమావేశంలో పీతా రామకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## కారుమూరి సునీల్ అక్రమ అరెస్ట్ బీసీలను అనగదొక్కే చర్య

**ఇది కేవలం కక్ష సాధింపు చర్య మాత్రమే**

**సనపల రవీంద్ర భరత్**

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖపట్నం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీసీ విభాగం అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు కొడుకు కారుమూరు సునిల్‌ను అక్రమంగా అరెస్టు చేసి లేని కేసు సృష్టించి అన్యాయంగా వేధిస్తున్నారు. ఇది కేవలం కుట్ర మాత్రమే అని ఉద్దేశపూర్వకంగా వైయస్సార్‌సీపీ నాయకులను వేధిస్తున్నారు.నాడు మద్యం రవాణాలో అక్రమాలు చేశారంటూ. వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం సరఫరా, విక్రయాలు అన్నీ పారదర్శకంగా జరిగాయి. అక్రమ మద్యాన్ని పూర్తిగా నియంత్రించడం జరిగింది. లేని మద్యం కేసు సృష్టించి, ఆ కేసులో పార్టీ పెద్దలను ఇరికించే కుట్ర చేశారు. ఇద్దరు మాజీ ఉన్నతాధికారులను అన్యాయంగా జైల్లోనూ ఉంచారు. మాజీ మంత్రి కారుమూరు నాగేశ్వరరావు కుటుంబాన్ని టార్గెట్ చేసి, మద్యం రవాణాలో అక్రమాలు చేశారంటూ, కేసు బనాయించి, అన్యాయంగా అరెస్ట్ చేశారు. దీన్ని పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది అత్యంత హేయం. ప్రభుత్వం ఇకనైనా తన వైఖరి మార్చుకోవాలి. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో యాదవ సాదికార జిల్లా అధ్యక్షుడు యడ్ల సుమన్, రాష్ట్ర బీసీ విభాగం జనరల్ సెక్రటరీ తుల్లి చంచంద్రశేఖర్, వార్డు పార్టీ అద్యక్షుడు చోల్లంగి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో సాయికృష్ణ తల్లి భేటీ


**కుటుంబసభ్యులతో కలసి వెళ్లిన విజయలక్ష్మి**

**సాయికృష్ణ అదృశ్యంపై విచార జరుగుతోందన్న సీఎం**

**ఎంతటి వారినైనా వదలబోమని చంద్రబాబు హామీ**

**అమరావతి (జయ జయహే)**

విజయవాడలోని కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సాయికృష్ణ కుటుంబసభ్యులు శుక్రవారం కలిశారు. సాయికృష్ణ తల్లితో పాటు ఇతర కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబును సాయికృష్ణ కుటుంబసభ్యులు కలిశారు. తమకు న్యాయం చేయాలంటూ సాయికృష్ణ తల్లి కోరారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. సాయికృష్ణ అదృశ్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి, దర్యాప్తును వేగవంతం చేశామని వెల్లడించారు. తప్పు చేసినవారు ఎంతటివారైనా ఉ



పేక్షించబోమని సాయికృష్ణ తల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తన కుమారుడి అదృశ్యంపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమెకు సీఎం ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. తప్పుచేసింది ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయం చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబుకు చెప్పామని సాయికృష్ణ మేనమామ ముళ్లపూడి నవరంగ్ తెలిపారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com